

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శనివారం 21-02-2026 | సంపుటి - 26 | సంచిక -273 | రూ : 4 | పేజీలు: 8


## సి-డాక్‌కు కోడ్ ఆడిటింగ్..

- 'ధరణి' లావాదేవీలపై లోతుగా విచారణ
- పోర్టల్ ప్రారంభం నుంచీ రక్షణపరమైన లోపాలు

హైదరాబాద్: సాగు భూముల పోర్టల్‌లో లోతైన ఆడిటింగ్ వ్యవస్థను తీసుకొచ్చేందుకు ప్రభుత్వం దృష్టి సారించింది. కోడ్ ఆడిటింగ్‌ను ఏర్పాటు చేసేందుకు సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సిడాక్)కు బాధ్యతలు అప్పగించింది. తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్(టీజీఎస్‌ఎస్) నేతృత్వంలో సిడాక్ కోడ్ ఆడిటింగ్‌ను చేపట్టనుంది. భూ భారతి పోర్టల్లో ఇటీవల జనగామ, యాదాద్రి భువనగిరి జిల్లాల కేంద్రంగా స్టాంపు డ్యూటీ, చలాన్ల డబ్బును కొందరు దారి మళ్లించిన విషయం తెలిసిందే. దీనిపై విచారణకు ఏర్పాటు చేసిన హైలెవల్ కమిటీ మరిన్ని లోతైన విషయాలను గుర్తించింది. ధరణి పోర్టల్ ఏర్పాటు నాటి నుంచి కొన్ని రక్షణపరమైన లోపాలు ఉన్నట్లు ఆ కమిటీ రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకొచ్చినట్లు తరువాయి 2లో








## కృత్రిమ మేధపై వార్‌రూం

- హైదరాబాద్‌లో ఏర్పాటు చేయండి
- నీతి ఆయోగ్ తరహాలో నేషనల్ కౌన్సిల్ నెలకొల్పాలి
- ప్రధాని మోదీకి సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి
- ఏఐ ఇంపాక్ట్ సమిట్-2026లో ప్రసంగించిన ముఖ్యమంత్రి

2లో

## 7 దిగ్గజ సంస్థలతో ఒప్పందాలు

- రాష్ట్రంలో క్వాంటమ్, ఏఐ టెక్నాలజీ విస్తరణే లక్ష్యం
- విద్యార్థులు, యువతకు కొత్త సాంకేతికతల్లో శిక్షణ
- సీఎం చంద్రబాబు సమక్షంలో సంతకాలు

2లో






2లో

## భారత్ తో సంబంధాల్లో కొత్త మలుపు

### వీసా సేవలను పునఃప్రారంభించిన బంగ్లాదేశ్

- ఢిల్లీలో వీసా సేవలను ప్రారంభించిన బంగ్లాదేశ్
- ప్రధానిగా తారిఖ్ రెహమాన్ బాధ్యతలు చేపట్టిన మూడు రోజుల్లోనే కీలక నిర్ణయం
- త్వరలోనే బంగ్లాదేశ్ లో వీసా సేవలను ప్రారంభించనున్న భారత్

## ట్రంప్ సుంకాలు చెల్లవు

- అధ్యక్షుడికి అమెరికా సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బ
- ప్రపంచ దేశాలపై విధించిన భారీ టారిఫ్‌ల రద్దు
- 6:3 మెజారిటీతో అమెరికా సర్వోన్నత న్యాయస్థానం తీర్పు
- కోర్టు తీర్పుపై మండిపడిన డొనాల్డ్ ట్రంప్
- మరింత రెచ్చిపోతూ అదనంగా 10 శాతం సుంకం విధిస్తున్నట్లు ప్రకటన
- ధర్మాసనం విదేశీ ప్రభావానికి గురైందని ఆక్షేపణ
- భారత్‌తో ఒప్పందానికి ముప్పేమీ లేదన్న ట్రంప్



2లో

## మార్చి మొదటి వారంలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు





- ప్రభుత్వ సన్నాహాలు
- సోమవారం నాటి క్యాబినెట్‌లో ముహూర్తం ఖరారు

2లో

## పాత స్మార్ట్‌ఫోన్లలో అరుదైన సంపద


- ఈవేస్ట్ నుంచి రేర్‌ఎర్త్ మాగెట్స్
- దేశ భద్రత, శక్తి స్వావలంబనకు మార్గం
- భారత్‌కు వ్యూహాత్మక బలం

న్యూఢిల్లీ : మన ఇండ్లలో పాతబడిన స్మార్ట్‌ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లు ఇకపై సాధారణమైన ఈవేస్ట్‌గా చూడొద్దు. ఎందుకంటే అవి అరుదైన తరువాయి 2లో




## మండలి సాక్షిగా

### వైకాపా మహాపచారం



- శ్రీవారి చిత్రపటాలతో సభలో ఆందోళన
- ఛైర్మన్ వారించినా తగ్గని ఆ పార్టీ సభ్యులు
- మంత్రి లోకేశ్, కూటమి పార్టీల సభ్యుల తీవ్ర అభ్యంతరం
- దేవుణ్ని రాజకీయాల్లోకి లాగుతారా అంటూ ధ్వజం

2లో

# కృత్రిమ మేధపై వార్‌రూం

దిల్లీ: ప్రపంచవ్యాప్తంగా ఏఐ రంగంలో వేగంగా వచ్చే మార్పులను ఎప్పటికప్పుడు పసిగట్టి అందుకు తగ్గట్టు స్పందించడం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంలో హైదరాబాద్‌లో కృత్రిమ మేధ(ఏఐ) వార్ రూం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ రంగంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేయడానికి వీలుగా జీఎస్‌టీ కౌన్సిల్, నీతి ఆయోగ్ తరహాలో కృత్రిమ మేధపై నేషనల్ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు. ఆయన శుక్రవారం ఇక్కడ భారత మండపంలో జరిగిన ఏఐ ఇంపాక్ట్ సమిట్ 2026లో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా.. ఏఐ విప్లవాన్ని అందిపుచ్చుకోవడానికి వ్యవస్థాగతంగా తీసుకోవాల్సిన చర్యలను సూచించారు. పారిశ్రామిక, తయారీ విప్లవాన్ని చేజార్చుకున్న భారత్ ఏఐ విప్లవాన్ని మాత్రం వదులుకోరాదని పిలుపునిచ్చారు.

**వినియోగం-ఉత్పత్తి.. రెండే దారులు**

“ఏఐ పరుగు ఇప్పటికే మొదలైంది. ఇందులో కొన్ని దేశాలు, కంపెనీలు, వ్యక్తులు ముందడుగు వేశారు. భారత్ ఇదివరకు పారిశ్రామిక, తయారీ విప్లవాన్ని అందుకోలేకపోయింది. సేవా విప్లవంలో సాఫ్ట్‌వేర్, టెలికాం రంగాల్లో తన వంతు పాత్ర మాత్రం పోషించగలిగింది. సాఫ్ట్‌వేర్ రంగంలో మనం సర్వీసులను అందించినా ప్రపంచ స్థాయి ఉత్పత్తులను తయారు చేయలేక పోయాం. గూగుల్ సెర్చ్, గూగుల్ మ్యాప్స్, ఎక్స్, ఫేస్‌బుక్ యూట్యూబ్, వాట్సప్‌లను భారతీయులు ఉపయోగిస్తున్నా.. ఆ కంపెనీల్లో మనవాళ్లు పనిచేస్తున్నా అవి మన సొంతం మాత్రం కాదు. వాటిని మనం సృష్టించలేదు. ఏ దేశమైనా ప్రపంచ గమనాన్ని నిర్దేశించడానికి వినియోగంఉత్పత్తి అన్న రెండే దారులున్నాయి. ఏఐతో మనం ఆ రెండూ చేయొచ్చు కాబట్టి ఈ రంగంలో భారత్ లీడర్‌గా ఎదగాలి. చిప్స్, గ్రీన్ ఎనర్జీ, డేటా స్టోరేజ్, ప్లాట్‌ఫామ్స్, అప్లికేషన్లు, సర్వీసుల్లో ప్రపంచంలో తొలి మూడు స్థానాల్లో నిలవడానికి ఒక స్పష్టమైన మార్గ సూచిక తయారు చేసుకోవాలి. ఏఐలో వస్తున్న మార్పులను పర్యవేక్షిస్తూ అందుకు అనుగుణంగా స్పందించడానికి కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలతో కలిపి ఒక వార్ రూమ్ ఏర్పాటు చేయాలి. ఈ రంగంలో మార్పులు అత్యంత వేగంగా జరుగుతుంటాయి కాబట్టి వార్ రూమ్ ఏర్పాటు అన్నది చాలా కీలకం. దానిని కేంద్ర ప్రభుత్వ సహకారంతో హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలి. వాస్తవ పరిశోధనల కోసం ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఏఐ విశ్వవిద్యాలయాన్ని కూడా నెలకొల్పాలి. మనం జీపీయూ చిప్స్ తయారు చేయాలి. మొత్తం సప్లై చైన్‌లో భాగస్వాములమవ్వాలి. అందుకోసం రేర్ ఎర్త్ మాగ్నెట్స్‌ను ఉత్పత్తి చేయాలి.

*** ఉద్యోగాలు కోల్పోయేవారిని రీస్కిల్లింగ్ చేయడంపై దృష్టి**

ఏఐ ద్వారా జరిగే ఉద్యోగ నష్టాలను అంచనా వేయడానికి ఒక వ్యవస్థను నెలకొల్పాలి. దీన్ని ఏమాత్రం ఆలస్యం చేయడానికి వీల్లేదు. ఉద్యోగాలు కోల్పోయేవారిని రీస్కిల్లింగ్ చేయడంపై దృష్టి సారించాలి. స్టార్టప్‌ల కోసం ఏఐ ఫండ్ ఏర్పాటు చేయాలి. దానివల్ల మన యువత అన్ని విభాగాలపై పనిచేసి యూనికార్న్‌లుగా ఎదగడానికి వీలవుతుంది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో దేశం కోసం ఏఐ స్టార్టప్ విలేజ్ ఏర్పాటు చేయడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఈ రంగంలో మరింత ముందుకెళ్లడానికి ఇలాంటి సదస్సులను హైదరాబాద్ లాంటి విభిన్న నగరాల్లో ఏడాదికి రెండుసార్లు నిర్వహించాలి. జీఎస్‌టీ కౌన్సిల్, నీతి ఆయోగ్ తరహాలో ఏఐ రంగంలో విధానాలు, చట్టాలు, నైతిక ప్రమాణాల మార్గనిర్దేశం కోసం నేషనల్ ఏఐ కౌన్సిల్ ఏర్పాటు చేయాలి” అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ అంతర్జాతీయ సమిట్‌ను సుసాధ్యం చేశారంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఐటీ, ఎలక్ట్రానిక్స్ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌లకు అభినందనలు తెలిపారు.

## మార్చి మొదటి వారంలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

హైదరాబాద్ : రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను మార్చి మొదటి వారంలో నిర్వహించేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించినట్టు సమాచారం. సోమవారం నిర్వహించబోయే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో సంబంధిత తేదీలను కూడా ఖరారు చేయనున్నారు. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటికే తన వార్షిక బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టిన సంగతి విదితమే. మన రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు, అనంతరం సీఎం ముంబై, ఢిల్లీ పర్యటనల నేపథ్యంలో అసెంబ్లీని సమావేశపరచటంలో కొంత ఆలస్యమైందని అధికారులు తెలిపారు. మరోవైపు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇటీవలే ప్రీ బడ్జెట్ సమావేశాలను ప్రారంభించారు. రోజుకు రెండు మూడు శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళా శిశు సంక్షేమ శాఖల గత కేటాయింపులు, వాటి ఖర్చు, రాబోయే బడ్జెట్ ప్రతిపాదనలపై ఆయన వారితో చర్చించారు. ఇవిగాక మిగతా శాఖల కేటాయింపులపై చర్చించి, ప్రతిపాదనలను స్వీకరించాల్సి ఉంది. కాగా ఇప్పటికే అన్ని శాఖల నుంచి ఆన్‌లైన్‌లో ప్రతిపాదనలు స్వీకరించామని ఆర్థికశాఖ వర్గాలు తెలిపాయి. వాటిపై డిప్యూటీ సీఎం ఒకసారి సమగ్రంగా చర్చించి, కేటాయింపులపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని ఆయా వర్గాలు పేర్కొన్నాయి. ఇదంతా పూర్తవటానికి కనీసం వారం నుంచి పది రోజులు పడుతుందని అంచనా. ఈ కారణాల రీత్యా వచ్చే నెల మొదటి వారం నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**హైదరాబాద్‌కు సీఎం...**

కాగా సీఎం రేవంత్ రెడ్డి... తన ముంబై, ఢిల్లీ పర్యటనలను ముగించుకుని శుక్రవారం రాత్రి హైదరాబాద్‌కు చేరుకున్నారు. ముంబై క్లైమేట్ వీక్ కార్యక్రమంలో పాల్గొనేందుకు మంగళవారం రాత్రి ముఖ్యమంత్రి అక్కడికి బయల్దేరి వెళ్లిన సంగతి విదితమే. బుధవారం ఆయన ముంబై నుంచి ఢిల్లీకి పయనమయ్యారు. ఏఐసీసీ నిర్వహించిన ప్రత్యేక సమావేశాల్లో పాల్గొన్న సీఎం కొన్ని ప్రయివేటు కార్యక్రమాలకు కూడా హాజరయ్యారు. శుక్రవారం తిరిగి హైదరాబాద్‌కు చేరుకున్న ముఖ్యమంత్రి... శనివారం వికారాబాద్ జిల్లా అనంతగిరి హిల్స్‌లో ప్రారంభమయ్యే ఏపీ, తెలంగాణ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల (డీసీసీ) శిక్షణా శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరవుతారని సీఎంవో వర్గాలు తెలిపాయి.


## సి-డాక్‌కు కోడ్ ఆడిటింగ్..

హైదరాబాద్: సాగు భూముల పోర్టల్‌లో లోతైన ఆడిటింగ్ వ్యవస్థను తీసుకొచ్చేందుకు ప్రభుత్వం దృష్టి సారించింది. కోడ్ ఆడిటింగ్‌ను ఏర్పాటు చేసేందుకు సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సిడాక్)కు బాధ్యతలు అప్పగించింది. తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్(టీజీఎస్ఎస్) నేతృత్వంలో సిడాక్ కోడ్ ఆడిటింగ్‌ను చేపట్టనుంది. భూ భారతి పోర్టల్లో ఇటీవల జనగామ, యాదాద్రిభువనగిరి జిల్లాల కేంద్రంగా స్టాంపు డ్యూటీ, చలాన్ల డబ్బును కొందరు దారి మళ్లించిన విషయం తెలిసిందే. దీనిపై విచారణకు ఏర్పాటు చేసిన హైలెవల్ కమిటీ మరిన్ని లోతైన విషయాలను గుర్తించింది. ధరణి పోర్టల్ ఏర్పాటు నాటి నుంచి కొన్ని రక్షణపరమైన లోపాలు ఉన్నట్లు ఆ కమిటీ రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిసింది. దీంతో పోర్టల్‌ను మరింత పకడ్బందీగా తయారు చేయాలని మంత్రి ఆదేశించినట్లు సమాచారం. ఈ క్రమంలోనే సాఫ్ట్‌వేర్ రంగంలో పరిశోధన అభివృద్ధి(ఆర్అండ్‌డీ)లో పట్టున్న కేంద్ర ప్రభుత్వ సంస్థ సిడాక్‌కు బాధ్యతలు అప్పగించారు. సాఫ్ట్‌వేర్ సమస్యలు, పరిష్కారాలు, డేటా భద్రతపై ఈ సంస్థ సేవలను రెవెన్యూశాఖ తీసుకోనుంది. ధరణి సాఫ్ట్‌వేర్ రూపొందించిన ప్రైవేటు సంస్థ టెర్రా ఐసిస్ నాడు రక్షణ చర్యలపై దృష్టి పెట్టలేదని, కోడ్ ఆడిటింగ్ లాంటి వ్యవస్థలను ఏర్పాటు చేసుకోలేదని... రహస్యంగా లాగిన్లను తెరిచి ప్రభుత్వ భూములను కొల్లగొట్టడం లాంటి అక్రమాలకు ఇదొక కారణమన్న అభిప్రాయం రెవెన్యూ వర్గాల్లో ఉంది. 2020 అక్టోబరు నుంచి ధరణి అమల్లోకి రాగా అప్పటి నుంచే సరైన రక్షణ వ్యవస్థలు లేవని... 2024 చివరలో టెర్రా ఐసిస్ నుంచి ఎన్ఐసీకి భూముల డేటా బదిలీ చేసిన సమయంలో ఎన్ఐసీ కూడా గుర్తించలేకపోయిందని రెవెన్యూ వర్గాలు పేర్కొంటున్నాయి.

**ప్రభుత్వ స్థాయిలో వింగ్ అవసరమే...**

దాదాపు 75 లక్షల మందికిపైగా రైతులు, సుమారు 1.60 కోట్ల ఎకరాల భూములు, లక్షల ఎకరాల ప్రభుత్వ భూముల డేటా నిర్వహణ ఈ పోర్టల్ ద్వారా జరుగుతోంది. రోజుకు సగటున 40వేల లావాదేవీలు జరుగుతున్నాయి. ఈక్రమంలో డేటాలో ఏవైనా లోపాలు, సమస్యలు వస్తే వాటిని సమీక్షించడానికి ప్రభుత్వపరంగా ఒక ఎక్స్‌పర్ట్ వ్యవస్థ లేదు. గతంలో టెర్రా ఐసిస్, ఇప్పుడు ఎన్ఐసీ డేటా నిర్వహణ చేపడుతుండగా సాంకేతికతపై లోతైన అవగాహన, సమీక్షించే నేర్పున్న నిపుణుల అవసరాన్ని ఇటీవల జనగామ సంఘటన నొక్కిచెప్పింది. సాంకేతిక సేవల్లో లోపాలు, అక్రమాలు జరగకుండా ఉండేలా ఎప్పటికప్పుడు ఆడిటింగ్ నిర్వహించే వ్యవస్థలు ప్రభుత్వానికి అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

## ట్రంప్ సుంకాలు చెల్లవు



వాషింగ్టన్: దాదాపు ప్రపంచంలోని అన్ని దేశాలపై ఎడాపెడా భారీ సుంకాలు విధించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు సర్వోన్నత న్యాయస్థానంలో శుక్రవారం గట్టి ఎదురుదెబ్బ తగిలింది. అమెరికా చట్టసభల(కాంగ్రెస్) అనుమతిలేకుండా విధించిన ఆ సుంకాలను రద్దుచేస్తూ తొమ్మిది మంది న్యాయమూర్తులతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం 6:3 మెజారిటీతో తీర్పు వెలువరించింది. అధ్యక్షుడి అత్యవసర అధికారాల చట్టాన్ని వినియోగిస్తూ ప్రతీకార సుంకాలు విధించడాన్ని కూడా ధర్మాసనం తప్పుపట్టింది. రాజ్యాంగం ప్రకారం చట్టసభలకు మాత్రమే పన్నులు, సుంకాల విధింపు అధికారం ఉంటుందని స్పష్టంచేసింది. ‘పన్నులు, సుంకాలు విధించే అధికారాన్ని రాజ్యాంగ నిర్మాతలు కార్యనిర్వాహక శాఖకు ఇవ్వలేదు’ అని మెజారిటీ తీర్పు రాసిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జాన్ రాబర్ట్స్ పేర్కొన్నారు. అయితే, ఆరుగురు న్యాయమూర్తుల మెజారిటీ తీర్పునకు భిన్నంగా ముగ్గురు జడ్జీలు విడిగా అసమ్మతి తీర్పును రాశారు. టారిఫ్ విధానంలోని మంచి చెడ్డలు ఎలా ఉన్నప్పటికీ అధ్యక్షుడి నిర్ణయం చట్టబద్ధమేనని, గతంలోనూ ఈ తరహా చర్యలు తీసుకున్నారని ముగ్గురు జడ్జీలు పేర్కొన్నారు. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా భారత్‌పై అదనంగా విధించిన సుంకాలను, ప్రతీకార సుంకాలను ట్రంప్ తగ్గించిన విషయాన్ని జస్టిస్ బ్రెట్ కవనాఫ్ అసమ్మతి తీర్పులో ప్రస్తావించారు.

**ఆ సొమ్ము తిరిగి చెల్లిస్తారా?**

ట్రంప్ ఆదేశాల మేరకు దిగుమతిదారుల నుంచి ఇప్పటి వరకు అదనంగా వసూలు చేసిన సుంకాలను ఆయా కంపెనీలకు తిరిగి చెల్లించాలా వద్దా అనే విషయాన్ని సుప్రీంకోర్టు తీర్పు స్పష్టం చేయలేదు. అసలు ఆ విషయాన్నే ప్రస్తావించలేదు. చాలా కంపెనీలు అదనపు దిగుమతి సుంకాలను తమకు తిరిగి చెల్లించాలంటూ దిగువ న్యాయస్థానాల్లో పిటిషన్లు దాఖలు చేశాయి. దిగుమతిదారుల నుంచి అదనపు సుంకాలను వసూలు చేయడం ద్వారా గత ఏడాది డిసెంబరు వరకు 13,300 కోట్ల డాలర్లు అమెరికా ఖజానాకు చేరాయని అంచనా. దిగుమతి, ప్రతీకార సుంకాల వసూలును సుప్రీంకోర్టు రద్దు చేయడం వల్ల ఆ మొత్తాల తిరిగి చెల్లింపులో గందరగోళ పరిస్థితి ఏర్పడుతుందని అసమ్మతి తీర్పురాసిన జడ్జి జస్టిస్ కవనాఫ్ పేర్కొన్నారు. అదనపు సుంకాల వసూలును నిలిపివేసినా, వసూలు చేసిన మొత్తాలను తిరిగి చెల్లించాల్సి వచ్చినా ట్రంప్ ప్రభుత్వ ఆదాయ అంచనాలు తలకిందులయ్యే అవకాశం ఉంది. వచ్చే పదేళ్లలో అదనపు సుంకాల వసూళ్లు 3లక్షల కోట్ల డాలర్ల మేర ఉంటాయని అంచనా. సుప్రీంకోర్టు తీర్పుపై అమెరికాలోని దిగుమతి కంపెనీల సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి.

## పాత స్మార్ట్‌ఫోన్లలో అరుదైన సంపద

న్యూఢిల్లీ : మన ఇండ్లలో పాతబడిన స్మార్ట్‌ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లు ఇకపై సాధారణమైన ఈవేస్ట్‌గా చూడొద్దు. ఎందుకంటే అవి అరుదైన భూధాతువుల నిల్వలుగా మారుతున్నాయి. ఈ పరికరాల్లోని నియోడియమ్ అయస్కాంతాలు, లిథియం కోబాల్ట్ వంటి ఖనిజాలను తిరిగి పొందడం ద్వారా దేశ భద్రత, శక్తి స్వావలంబనకు భారతీయ శాస్త్రవేత్తలు బాటలు వేస్తున్నారు. ఒక గని ద్వారా లభించే, ఉత్పత్తి అయ్యే దానితో పోలిస్తే.. ఈవేస్ట్ నుంచే ఎక్కువగా కీలకమైన ఖనిజాలు, అరుదైన భూధాతువుల లభ్యత ఉంటుందని నిపుణులు చెపుతున్నారు.

*** పాత ఫోన్‌లలో ఉన్న అసలు సంపద ఏమిటి?**

ప్రతి పాత ఫోన్‌లో నియోడియమ్ వంటి అరుదైన భూధాతువులతో తయారైన శక్తివంతమైన అయస్కాంతాలు ఉంటాయి. ఇవి ఫైటర్ జెట్స్, క్షిపణులు, ఎలక్ట్రిక్ వాహనాలు, ఆధునిక ఎలక్ట్రానిక్స్‌లో కీలకం. గ్రేటర్ నోయిడాలోని లోహమ్ సంస్థ రీసైక్లింగ్ డిపార్ట్‌మెంట్ హెడ్ సయ్యద్ గజన్ఫర్ అబ్బాస్ మాట్లాడుతూ... ”ఒక టన్ను కోబాల్ట్ గనిలో 12 కిలోల కోబాల్ట్ మాత్రమే లభిస్తుంది. కానీ ఉపయోగించిన బ్యాటరీ వ్యర్థాల్లో మాత్రం ఇది 5080 కిలోల వరకు ఉంటుంది” అని వివరించారు. దీనిని బట్టి చూస్తే.. పాత బ్యాటరీలు అనేవి గనుల కంటే 80 రెట్లు అధిక సాంద్రత కలిగిన ఖనిజ వనరులుగా మారాయని అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం ప్రపంచ అరుదైన భూధాతువల శుద్ధిలో చైనా దాదాపు 90 శాతం ఆధిపత్యాన్ని కలిగి ఉన్నది. ఈ నేపథ్యంలో వ్యర్థాల నుంచి ఖనిజాల పునర్వినియోగం భారత్‌కు వ్యూహాత్మక మార్గంగా మారిందని నిపుణులు, విశ్లేషకులు చెప్తున్నారు.

*** 900 డిగ్రీల అటామిక్ రీసెట్ అంటే..?**

భారత ల్యాబ్‌లలో 900 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత వద్ద ప్రత్యేక గ్యాస్ రక్షిత గదిలో అయస్కాంతాలను శుద్ధి చేస్తారు. నియోడియమ్ ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన అయస్కాంతాలను ఇస్తుంది. డైస్ప్రోసియమ్ వేడి నిరోధకతను అందిస్తుంది. ఈ ఉష్ణోగ్రత వద్ద అయస్కాంతంలోని సూక్ష్మ పగుళ్లు నయం అవుతాయి. అయితే ‘క్యూరీ పాయింట్’ (310 400 డిగ్రీల సెల్సియస్) దాటితే అయస్కాంత శక్తి శాశ్వతంగా కోల్పోతుంది. అందుకే శాస్త్రవేత్తలు ఖచ్చితమైన, వేగవంతమైన తాపన విధానాన్ని అనుసరిస్తారు. సరైన నియంత్రణ లేకపోతే అయస్కాంతం పొడిగా మారే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**భారత్ ముందున్న సవాళ్లు**

ప్రస్తుతం భారత్ ఎక్కువగా ‘మెకానికల్ సెపరేషన్’ (పరికరాల నుంచి ప్లాస్టిక్, లోహాలను వేరు చేయడం) వరకు మాత్రమే పరిమితం. ‘బ్లాక్ మాస్’ అనే నల్లటి పొడిని తయారు చేస్తారు. ఇందులో లిథియం, కోబాల్ట్, నికెల్, మాంగనీస్ వంటివి ఉంటాయి.

## మండలి సాక్షిగా వైకాపా మహాపచారం

అమరావతి: వైకాపా ఎమ్మెల్సీలు శ్రీవారి చిత్రపటాల్ని ప్రదర్శిస్తూ శుక్రవారం మండలిలో ఆందోళనకు దిగడం దుమారం రేపింది. దేవుడి ఫొటోలు పట్టుకుని వైకాపా సభ్యులు సభలో ప్రవర్తించిన తీరుపై విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తీవ్రంగా స్పందించారు. ఇతర మంత్రులు, కూటమి పార్టీల సభ్యులు కూడా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పలువురు సభ్యులు పోడియం వద్దకు చేరి తమ నిరసన తెలిపారు. దేవుణ్ని రాజకీయాల్లోకి లాగుతారా? బుద్ధి ఉందా? అంటూ మండిపడ్డారు. శుక్రవారం ఉదయం 10.07 గంటలకు మండలి ప్రారంభమైంది. తిరుపతి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగంపై చర్చించేందుకు ఎమ్మెల్సీ బల్లి కల్యాణచక్రవర్తి, ఇందాపూర్ డెయిరీ పేరుతో హెరిటేజ్ సంస్థ తితిదేకి నెయ్యి సరఫరా అంశంపై చర్చించేందుకు వైకాపా ఎమ్మెల్సీలు కుంభా రవిబాబు, మాధవరావు, ఎస్.మంగమ్మ ఇచ్చిన వాయిదా తీర్మానాలను ఛైర్మన్ మోషేనురాజు తిరస్కరించి ప్రశ్నోత్తరాలను ప్రారంభించారు. తామిచ్చిన వాయిదా తీర్మానంపై చర్చ చేపట్టాలని వైకాపా సభ్యులు వేంకటేశ్వరస్వామి చిత్రపటాలను, ఇతర ప్లకార్డులను చేతపట్టుకుని పోడియం చుట్టుముట్టి ఆందోళనకు దిగారు. ఎమ్మెల్సీలు చంద్రగిరి ఏసురత్నం, లేళ్ల అప్పిరెడ్డి, పాలవలస విక్రాంత్, కుంభా రవిబాబు, కల్పలతా రెడ్డి, వరుదు కల్యాణి, మురుగుడు హనుమంతరావు, రమేష్‌యాదవ్ దేవుడి చిత్రపటాలను ప్రదర్శిస్తూ చర్చకు పట్టుబట్టారు.

## 7 దిగ్గజ సంస్థలతో ఒప్పందాలు

దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌ను క్వాంటమ్, ఏఐ హబ్‌గా తీర్చిదిద్దడం, అమరావతి క్వాంటమ్ వ్యాలీకి జాతీయ, అంతర్జాతీయ స్థాయి గుర్తింపు కల్పించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏడు దిగ్గజ సంస్థలతో ఒప్పందాలు చేసుకుంది. ఇందులో యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ కంప్యూటింగ్ సెంటర్ (యూఎన్ఐసీసీ), ఐబీఎం, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ, భారత్ జెన్ నెక్స్ట్ జెన్ఐబీఎం, కాలిబో ఏఐ, వైజర్, ఐఐటీ మద్రాస్‌లు ఉన్నాయి. ఇందుకు సంబంధించిన ఒప్పంద పత్రాలపై.. దిల్లీలోని భారత మండపంలో జరుగుతున్న ఏఐ ఇంపాక్ట్ సమిట్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమక్షంలో ఇరుపక్షాలు సంతకాలు చేశాయి. రాష్ట్రంలో ఏఐ, క్వాంటమ్ అనుకూల వాతావరణం పెంపొందించడానికి ఈ ఏడు ఒప్పందాలు బాటలు వేస్తాయని ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది. ఆయా ఒప్పందాల వివరాలివీ..

సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఏర్పాటుకు యూఎన్ఐసీసీతో: క్వాంటమ్, ఏఐ రంగాల్లో రాష్ట్రంలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం యూఎన్ఐసీసీతో ఒప్పందం చేసుకొంది. అమరావతి క్వాంటమ్ వ్యాలీలో ఈ ఏడాది చివరి నాటికి ఏఐ క్వాంటమ్ ఎక్స్‌లెన్స్ సెంటర్ ఏర్పాటు చేయడం దీని ప్రధాన ఉద్దేశం. ఈ సెంటర్‌ను ఏఐ క్వాంటమ్ డిజిటల్ ఎంబసీగా తీర్చిదిద్దుతారు. ఈ కార్యక్రమంలో యూఎన్ఐసీసీ డైరెక్టర్ సమీర్ చౌహాన్‌తోపాటు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

*** లక్ష మందికి విద్యార్థులకు శిక్షణ ఇచ్చేలా ఐబీఎంతో..**

క్వాంటమ్, ఏఐ, సైబర్ సెక్యూరిటీ విభాగాల్లో రాష్ట్రంలోని లక్ష మంది యువతకు శిక్షణ ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం ఐబీఎంతో ఒప్పందం చేసుకొంది. ఐబీఎం గ్లోబల్ డిజిటల్ లెర్నింగ్ ప్లాట్‌ఫాం ద్వారా ఐటీ పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాల్లో శిక్షణ ఇస్తారు. ఈ అవగాహన ఒప్పంద కార్యక్రమంలో ఐబీఎం ఇండియా ఎండీ సందీప్ పటేల్, దక్షిణాసియా వ్యవహారాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కిషోర్ బాలాజీ, రీసెర్చ్ ల్యాబ్స్ డైరెక్టర్ అమిత్ సింఘీలు పాల్గొన్నారు.

*** క్వాంటమ్ ఏఐ యూనివర్సిటీ ఏర్పాటుకు ఎన్ఐఈఎల్ఐటీతో...**

ఆంధ్రప్రదేశ్‌లో క్వాంటమ్ ఏఐ యూనివర్సిటీ ఏర్పాటు కోసం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ (ఎన్ఐఈఎల్ఐటీ)తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. దక్షిణ భారతదేశంలో మొట్టమొదటి ఏఐ, క్వాంటమ్ డీమ్డ్ యూనివర్సిటీ క్యాంపస్‌ను ఆ సంస్థ ఏపీలో ఏర్పాటు చేస్తుంది. దీనికి మౌలిక సదుపాయాలకు అవసరమైన నిధులు కేంద్రం నుంచి అందుతాయి. రాష్ట్రప్రభుత్వం భూమి, హార్డ్‌వేర్ సమకూరుస్తుంది. అమరావతిని క్వాంటమ్ కంప్యూటింగ్‌లో నేషనల్ హబ్‌గా తీర్చిదిద్దడానికి అవసరమైన కార్యాచరణను ఈ సంస్థ అమలు చేస్తుంది. ఒప్పందాల కార్యక్రమంలో ఎన్ఐఈఎల్ఐటీ డైరెక్టర్ మదన్‌మోహన్ త్రిపాఠి, కంట్రోలర్ జనరల్ అలోక్ త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

## భారత్ తో సంబంధాల్లో కొత్త మలుపు

ఢిల్లీలోని బంగ్లాదేశ్ రాయబార కార్యాలయం శుక్రవారం నుంచి భారతీయులకు అన్ని రకాల వీసాల మంజూరు సేవలను పునఃప్రారంభించింది. గత రెండు నెలలుగా పూర్తిగా నిలిచిపోయిన ఈ సేవలు ఇప్పుడు మళ్లీ అందుబాటులోకి వచ్చాయి. బంగ్లాదేశ్ నూతన ప్రధానిగా తారిఖ్ రెహమాన్ బాధ్యతలు చేపట్టిన మూడు రోజుల్లోనే ఈ సానుకూల నిర్ణయం తీసుకున్నారు. ఢిల్లీలో వీసా సేవలు ప్రారంభమయ్యాయి. త్వరలో ఢాకాలోని భారత రాయబార కార్యాలయంలో కూడా బంగ్లాదేశ్ నుంచి భారత్ కు వీసాలు జారీ చేసే సేవలు మళ్లీ మొదలవుతాయని బంగ్లాలోని భారత రాయబార కార్యాలయం అధికారి అనిరుద్ధ దాస్ తెలిపారు. మెడికల్, టూరిజం సహా అన్ని రకాల వీసాలు అందుబాటులోకి రానున్నాయి. దీంతో, ఇరు దేశాల మధ్య సంబంధాలు మళ్లీ గాడిన పడే అవకాశం ఉంది.

# మత్స్యావతారంలో నారసింహుడు



యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం ఆలయంలో అలంకారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారు మాడ[వీధుల్లో మత్స్యావతారంలో దర్శనమిచ్చారు. అవతార విశిష్టతను అర్చకులు భక్తులకు వివరించారు. యాగశాలలో అగ్నిదేవుడి ఆరాధన, సకల దేవతల ఆతిథ్యపర్వాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

# ఏఐ యుగంలో దూసుకెళ్తున్న తెలంగాణ

- గ్రామాల వరకు డిజిటల్ కనెక్టివిటీ
- నైపుణ్యాల పెంపుదలకు ప్రత్యేక కార్యాచరణ
- టాలెంట్ పూల్‌తో ప్రపంచాన్ని ఆకర్షిస్తున్నాం
– రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- వంగాల రమేష్, సీనియర్ జర్నలిస్టు




కృత్రిమ మేధ రంగంలో తెలంగాణ రాష్ట్రం వేగంగా ముందుకు సాగుతోందని, ఏఐ పరిశోధనలు, ఆవిష్కరణలకు రాష్ట్రంలో అపారమైన ప్రతిభావంతుల సమూహం సిద్ధంగా ఉందని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. ఢిల్లీలో నిర్వహించిన అంతర్జాతీయ ఏఐ సమ్మిట్‌లో స్వీడన్ వాణిజ్య ప్రతినిధులు, కృత్రిమ మేధ నిపుణులు, పలు దేశాల ఉన్నతాధికారులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ప్రభుత్వ సేవలు, వాతావరణ స్థితిస్థాపకతలో ఏఐ వినియోగంపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఏఐ వల్ల వచ్చే మార్పులను ముందుగానే అంచనా వేసి ప్రభుత్వం కార్యాచరణ ప్రారంభించిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో స్పష్టమైన విధానాలతో ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. ఏఐ విస్తరణతో ఉద్యోగ రంగంలో మార్పులు అనివార్యమని, అందుకు యువతను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. సాఫ్ట్‌వేర్ నిపుణుల నైపుణ్యాల పెంపుదల కోసం ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు అమలు చేస్తున్నామని చెప్పారు. స్కిల్లింగ్, రీ స్కిల్లింగ్‌పై ప్రభుత్వం రెండేళ్లుగా దృష్టి కేంద్రీకరించిందన్నారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ప్రతిపాదిత ఏఐ యూనివర్సిటీలు ఈ లక్ష్య సాధనలో కీలకమని వివరించారు. ఏఐ పరిశోధన కేంద్రాలు, సేవల విస్తరణతో భారీ స్థాయిలో ఉద్యోగావకాశాలు సృష్టించబడతాయని అన్నారు. యువత మరింత సృజనాత్మక బాధ్యతలు చేపట్టే దిశగా ఏఐ మార్గం సుగమం చేస్తుందని తెలిపారు. సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత పెంచడంలో ఏఐ కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. ప్రతి గ్రామానికి ఇంటర్నెట్ సౌకర్యం అందించే మహత్తర కార్యక్రమం కొనసాగుతోందన్నారు. టీఫైబర్ ద్వారా గ్రామాలను ప్రపంచంతో అనుసంధానించే ప్రయత్నాలు వేగంగా సాగుతున్నాయని తెలిపారు. అవసరమైన అప్లికేషన్ల రూపకల్పనకు గ్లోబల్ టెక్ సంస్థలు తెలంగాణను భాగస్వామ్యంగా ఎంచుకోవాలని పిలుపునిచ్చారు. పెట్టుబడులకు తెలంగాణ అత్యంత అనుకూల రాష్ట్రంగా ఎదిగిందన్నారు. నిరంతర విద్యుత్ సరఫరా, స్థిర విధానాలు, పారదర్శక పాలనతో పెట్టుబడిదారులకు భరోసా కల్పిస్తున్నామని వివరించారు. కృత్రిమ మేధ విధ్వంసక శక్తి కాదని, అది భవిష్యత్‌ను మార్చే సాధనమని మంత్రి స్పష్టం చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగిస్తూ తెలంగాణను ఏఐ రంగంలో ముందంజలో నిలపడం ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

# టన్ను పామాయిల్ రూ.25 వేలు చేస్తాం: తుమ్మల



హైదరాబాద్: టన్ను పామాయిల్ ధరను మూడేళ్లలో రూ.25 వేలు చేసే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టంచేశారు. కామారెడ్డి జిల్లాలోని పాల్వంచలో శుక్రవారం నిర్వహించిన మెగా పామాయిల్ ప్లాంటేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం రైతులతో నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... ''ఇతర పంటలు వేస్తే వరదలు, వడగండ్లు, తెగుళ్లకు తట్టుకోలేవు. దిగుబడి వచ్చినా ధర ఉండదు. పామాయిల్‌కు ఆ సమస్య రాదు. అంతర పంటలుగా కోకో, వక్క, వరి, కూరగాయలనూ వేసుకోవచ్చు. వాటికీ రైతుభరోసా ఇస్తాం. రూ.300 కోట్లతో సిద్దిపేటలో ఆయిల్‌పాం సంబంధిత ఫ్యాక్టరీని నిర్మించాం'' అని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఉద్యానశాఖ సంచాలకురాలు యాస్మిన్ బాషా, కామారెడ్డి కలెక్టర్ ఆశిష్‌సాంగ్వాన్, హెచ్‌యూఎల్ ప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**వ్యవసాయంలో సాంకేతికతకు పెద్దపీట**

తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయరంగంలో అధునాతన సాంకేతికతకు పెద్దపీట వేస్తోందని మంత్రి తుమ్మల తెలిపారు. హైదరాబాద్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... 'దిల్లీలో నిర్వహిస్తున్న ఏఐ సమిట్‌లో తెలంగాణ వ్యవసాయ రంగంలో అమలు చేస్తున్న సాంకేతికత, డిజిటల్ మౌలిక వసతులు ప్రస్తావనకు రావడం గర్వకారణం. దేశంలో తొలిసారిగా ఫ్రాన్‌హోఫర్ హెచ్‌హెచ్‌ఐ, ఆచార్య జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, అగ్రిహబ్ ఫౌండేషన్, తెలంగాణ ప్రభుత్వం కలిసి రైతు రిజిస్ట్రీలు, భూముల వివరాలు, పంటల సమాచారం, శాస్త్రీయ సలహాలను అందిస్తున్నాయి' అని వివరించారు.

# స్థానిక సమస్యల పరిష్కారంలో జర్నలిస్టుల పాత్ర మరువలేనిది

- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్
- మేడిపల్లి ప్రెస్ క్లబ్ డైరీ ఆవిష్కరించిన మల్కాజిగిరి ఎంపీ,మేడ్చల్ ఎమ్మెల్యే





బోడుప్పల్, ప్రజాస్ఫూర్తి : బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని వేదిక బాంక్వేట్ హాల్ లో శుక్రవారం మేడిపల్లి మండల ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ 2026 డైరీ ఆవిష్కరణ కార్యక్రమం క్లబ్ అధ్యక్షుడు చిర్ర శ్రీధర్ రెడ్డి ఆద్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్,మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పాల్గొన్ని 2026 డైరీ ఆవిష్కరించారు.ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక సమస్యల పరిష్కారంలో లోకల్ జర్నలిస్టుల పాత్ర మరువలేనిదని,నేడు సమాజ నిర్మాణంలో జర్నలిస్టుల పాత్ర కీలకమైందన్నారు. ప్రభుత్వాలకు ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి ఇంకా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి వడ్డెమాను సుందర్, కోశాధికారి మరాటి మల్లేష్, సలహాదారులు కల్కూరి ఎల్లయ్య, ఉపాధ్యక్షుడు చింత రమేష్ , పీర్జాదిగూడ నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి, బోడుప్పల్ నగర బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి, మాజీ డీప్యూటి మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, సీపీఎం మండల కార్యదర్శి సృజన, సీపీఐ మండల కార్యదర్శి రచ్చ కిషన్, మాజీ కోఆప్షన్ సభ్యులు చిలుముల జగదీశ్వర్ రెడ్డి, చెంగిచెర్ల మాజీ ఉపసర్పంచ్ కొత్త రవి గౌడ్ మాజీ ఎంపిపీ బండారు శ్రీనివాస్ గౌడ్,మాజీ ఎంపిటిసి నర్సింగ్ రావు,కె వెంకటేష్ గౌడ్,మైనారిటీ అధ్యక్షుడు మదార్, క్లబ్ సీనియర్ సభ్యులు ననుబోతు రాము యాదవ్,దూడల విష్ణుగౌడ్, కోఅర్డినేటర్ రావు నాగిరెడ్డి, సంయుక్త కార్యదర్శులు చిన్నం మధు,దాసరి దయాకర్ రెడ్డి,నీరుడి అంజన్ కుమార్,కార్యవర్గ సభ్యులు చిన్నం గణేష్,భూష గణేష్, మరాటి మత్స్యగిరి,జక్కు భగీరద్ రెడ్డి, మోతె రఘు తిరుపతి రెడ్డి, జంగ నరేందర్ యాదవ్, క్లబ్ సభ్యులు బైరెడ్డి సందీప్ రెడ్డి, కొండ కింది సురేందర్ రెడ్డి సిహెచ్ రవికుమార్ బి సిద్ధు,తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరా గృహకల్ప కాలనీలో
# విద్యా వాలంటీర్‌కు ఆర్థిక సహాయం

- బీజేపీ నాయకుల ముందడుగు



ప్రజాస్ఫూర్తి , కాప్రా : చర్లపల్లి డివిజన్ పరిధిలోని ఇందిరా గృహకల్ప కాలనీలో ఉన్న ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలో దాదాపు యాభై మంది విద్యార్థులు వివిధ తరగతుల్లో విద్యనభ్యసిస్తున్నారు. అయితే పాఠశాలలో తగినంతమంది ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థుల విద్యాభ్యాసంపై ప్రభావం పడుతున్న నేపథ్యంలో కాలనీవాసులు చర్లపల్లి డివిజన్ బీజేపీ సీనియర్ నాయకులు కొమ్ము నర్సింగ్ రావు, డి. నాదం ను సంప్రదించారు.పాఠశాలకు ఒక విద్యా వాలంటీర్ అవసరమని, ఆ వాలంటీర్‌కు ప్రతినెల జీతభత్యాలు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరగా, బీజేపీ నాయకులు సానుకూలంగా స్పందించి గత రెండు నెలలుగా ఒక విద్యా వాలంటీర్‌కు నెలకు రూ. ఐదువేల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ నెలకు సంబంధించిన రూ. ఐదు వేల నగదును విద్యా వాలంటీర్‌కు అందజేశారు. అదేవిధంగా, ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు అరటి పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు మరియు రైల్వే బోర్డు మెంబర్ డి. నాదం, డివిజన్ ఉపాధ్యక్షుడు డి. రామకృష్ణ గౌడ్, యువమోర్చా అధ్యక్షుడు వి. రాంబాబు, సీనియర్ నాయకులు రాజేష్, వంశరాజ్, ఐజికే కాలనీవాసులు రాపోలు సోమేశ్వర్, బిక్షపతి, అనిల్ కుమార్, మేడిశెట్టి సూర్యప్రకాశ్, రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# వనపర్తి మున్సిపాలిటీ అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తా

- వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి
- వనపర్తి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్ల పదవి బాధ్యతల స్వీకరణ



ప్రజాస్ఫూర్తి ప్రతినిధి: వనపర్తి జిల్లా : ప్రణాళిక బద్ధంగా పనిచేసి వనపర్తి మున్సిపాలిటీ అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని, వారానికి ఒక వార్డు సందర్శించి సమస్యల పరిష్కారానికి పాటుపడతామని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వనపర్తి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్ల పదవీ బాధ్యత స్వీకరణ కార్యక్రమంలో భాగంగా భారీ ర్యాలీ చేపట్టారు. వనపర్తి ఇందిరాపార్క్ నుంచి భారీ ర్యాలీగా బయలుదేరి వివేకానంద చౌరస్తా, పాలిటెక్నిక్ కళాశాల, రాజీవ్ గాంధీ చౌరస్తా, అంబేద్కర్ చౌరస్తా మీదుగా మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ గా మాధవి, వైస్ చైర్మన్ గా మధుసూదన్ గౌడ్, మరో 20 మంది కౌన్సిలర్లు ఎమ్మెల్యే సమక్షంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ చైర్మన్ మాధవి తన మొట్టమొదటి సంతకాన్ని మున్సిపల్ ఉద్యోగులకు అందించే అలవెన్స్ ఫైల్ పై, తాగునీటి సమస్యల పరిష్కారం ఫైల్ పై సంతకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేఘా రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి అంటే గల్లీ నుంచి మొదలై మెయిన్ రోడ్డుకు చేరుకోవాలని వనపర్తి పట్టణంలోని ప్రతి గల్లీని సందర్శించి సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. ఇప్పటికే 54 కోట్ల రూపాయలతో ప్రతి వార్డులో సిసి రోడ్ల నిర్మాణం చేపట్టామని, 50 కోట్లు వనపర్తి పట్టణానికి, 20 కోట్లు పెబ్బేరు పట్టణానికి మంజూరు చేయించి పట్టణాన్ని అన్ని రంగాల్లో సుందరీకరణ తీర్చిదిద్దుతామని ఆయన అన్నారు. వనపర్తి పట్టణానికి 2000 ఇందిరమ్మ ఇండ్లు, పెబ్బేరు పట్టడానికి 500 ఇందిరమ్మ ఇండ్లు అధినంగా మంజూరు చేయించి ఇల్లు లేని ప్రతి నిరుపేదకు సొంత ఇంటి కల నెరవేరుస్తామన్నారు. గత పాలకుల లాగా పంచ కట్టుకుని సోకులకు పోయే రకం కాదని పని చేస్తూ ప్రజల మన్ననాలను పొందుతూ ముందుకెళతామన్నారు. గత రెండేళ్లుగా వనపర్తి నియోజకవర్గంలో సర్పంచుల బాధ్యతలు, ఎంపిటిసి బాధ్యతలు, కౌన్సిలర్ల బాధ్యతలు కూడా ఎమ్మెల్యేగా నేనే చూసుకున్నానని నేటి నుంచి ఎవరి బాధ్యతలు వారు బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని ఎక్కడ ఎలాంటి తప్పులకు తావు లేకుండా మున్సిపల్ అభివృద్ధి కోసం పెద్ద జీతగాళ్లలా పనిచేస్తామని ఎమ్మెల్యే చెప్పారు. ప్రతి వార్డు అభివృద్ధి చెందాలని అభివృద్ధి పనులకు నిధులు లేవనే మాట రాకుండా అవసరమైతే తననిధుల నుంచి కూడా ఖర్చు చేసి అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తామన్నారు. నేటి నుంచి అందరిపై గురుతరమైన బాధ్యతలు ఉన్నాయని వాటిని విస్మరించకుండా నిర్లక్ష్యం చేయకుండా అవినీతి అక్రమాలకు తావు లేకుండా నిధులు ఉపయోగించి పట్టణ ప్రజల మన్ననలు పొందుతామని ఎమ్మెల్యే చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు కల్వ సుజాత, వనపర్తి మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, వనపర్తి మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రజా క్షేత్రంలోనే పాలన.. కార్యకర్తలే మా బలం!

- మంత్రి పొంగులేటి ఆశయాలకు అనుగుణంగా ఏదులాపురం అభివృద్ధి
- మున్సిపల్ చైర్‌పర్సన్ అనిత కార్యాలయాన్ని ప్రారంభించిన తుంబూరు దయాకర్ రెడ్డి



ప్రజాస్ఫూర్తి/ఖమ్మం జిల్లా : అధికారం అంటే గద్దె మీద కూర్చోవడం కాదు.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం క్షేత్రస్థాయిలో శ్రమించడం" అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డు సాయి గణేష్ నగర్ (రోడ్డు నంబర్ 8) లో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

- **మంత్రి సంకల్పానికి తోడుగా..**

ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ..మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మార్గదర్శకత్వంలో ఏదులాపురం మున్సిపాలిటీని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. "ఈ కార్యాలయం కేవలం నాలుగు గోడల మధ్య నడిచేది కాదు..ఇది ప్రజల కష్టాలను పంచుకునే వేదిక కావాలి. చైర్‌పర్సన్ అనిత ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలి" అని ఆయన దిశానిర్దేశం చేశారు. కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని, వారి సమస్యలను కూడా ఈ కార్యాలయం వేదికగా పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.

- **అభివృద్ధిలో రాజీ పడం.**


మున్సిపల్ చైర్‌పర్సన్ అనిత మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో గెలిపించిన ప్రజలకు, తనకు అండగా నిలిచిన మంత్రి పొంగులేటికి కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపాలిటీలో పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ, రోడ్లు, తాగునీటి సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,వార్డు కౌన్సిలర్లు,పార్టీ కార్యకర్తలు,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# అభినవ స్టేడియంలో
## రాష్ట్ర స్థాయి కోకో పోటీలు ప్రారంభం



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : రాష్ట్ర స్థాయి కోకో పోటీలను శుక్రవారం మేకల అభినవ స్టేడియంలో ప్రారంభ కార్యక్రమంలో భాగంగా క్రీడా పతాకాన్ని ఆవిష్కరించి, క్రీడా జ్యోతిని (టార్చ్) వెలిగించి మ్యాచ్ ను నగర మేయర్ గురు చైతన్య శ్రీనివాస్ రెడ్డి కలెక్టర్ బి చంద్రశేఖర్లు లాంచనంగా ప్రారంభించారు, అనంతరం శాంతి, సామరస్యానికి చిహ్నంగా పావురాలను ఎగురవేసి, రంగురంగుల బెలూన్లను ఆకాశంలోకి వదిలినారు .ఈ సందర్భంగా నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడల ద్వారా ఎంతో మంది మట్టిలో మాణిక్యాలు వెలుగులోకి వస్తున్నారని, విద్యార్థులు చదువుతోపాటు క్రీడలులో రాణించాలి గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో ప్రతిభ గుర్తించి వారిని వెలికి తీయడానికి ప్రతి సంవత్సరం సీఎం కప్పు నిర్వహిస్తుందని క్రీడలు విద్యార్థులకు మానసిక ఉల్లాసంతో పాటు శారీరత్వాన్ని కలిగిస్తాయి. తెలంగాణ రాష్ట్రప్రభుత్వం క్రీడలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుంది అన్నారు.జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ మాట్లాడుతూరాష్ట్రస్థాయి జూనియర్ కోకో పోటీలు నిర్వహించడం 33 జిల్లాల క్రీడాకారులు కష్టపడి గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారని ,గ్రామీణ స్థాయి నుంచి విద్యార్థులను గుర్తించి తోడ్పడదించడమే సి ఎం కప్ పోటీల ముఖ్య ఉద్దేశం అని అన్నారుభవిష్యత్‌లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే క్రీడాకారులు ఇలాంటి పోటీల ద్వారానే తయారవుతారని ,క్రీడలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు సీఎం కప్ వంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. రాష్ట్ర స్థాయిజూనియర్ బాలికలకు బాలురకు కోకో పోటీలను జిల్లాలో నిర్వహించడం గర్వంగా ఉందని జిల్లాలో క్రీడాకారులకు అవసరమైన వసతులు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడా అధికారి అక్బర్ అలీ, జెడ్పీ సీఈవో శ్రీనివాసరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి,మాజీ జెడ్పిటిసి గుమ్మలమోహన్ రెడ్డి,కార్పొరేటర్ ఖలీల్,ప్రజాప్రతినిధులు, క్రీడా శాఖ అధికారులు, కోచ్‌లు, పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు.

## ఘనంగా జెకె శేఖర్ యాదవ్
# జన్మదిన వేడుకలు



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : కుత్బుల్లాపూర్ అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ జెకె శేఖర్ యాదవ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనను శాలువాలతో , పూలమాలలతో సత్కరించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం 25 మంది పారిశుధ్య కార్మికులకు చీరలు, పాయింట్ సెట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మేడారం కాఫీటేబుల్ పుస్తకం ఆవిష్కరణ

హైదరాబాద్: కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ రూపొందించిన మేడారం కాఫీటేబుల్ పుస్తకాన్ని మంత్రి సీతక్క శుక్రవారం ప్రజాభవన్‌లో ఆవిష్కరించారు. లివింగ్ హెరిటేజ్ విభాగంలో ఇప్పటికే కోల్‌కతా దుర్గా పూజ, దీపావళి పండగలకు హెరిటేజ్ హోదా లభించిన నేపథ్యంలో, మేడారం జాతరకు కూడా అంతర్జాతీయ వారసత్వ గుర్తింపు తీసుకొచ్చేలా తమ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఈ సందర్భంగా కాకతీయ హెరిటేజ్ సభ్యులు, ఫొటోగ్రాఫర్లను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సినీ దర్శకుడు, కాఫీటేబుల్ పుస్తకం ఎడిటర్ బి.నర్సింగరావు, విశ్రాంత ఐఏఎస్ అధికారులు బీవీ పాపారావు, బీపీ ఆచార్య, విశ్రాంత ఐపీఎస్ అధికారి ఎం.రతన్, కాకతీయ హెరిటేజ్ ట్రస్టీ ఎం.పాండురంగారావు, సభ్యుడు జె.శ్రీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.




# గురుకుల విద్యార్థులకు గుడ్ న్యూస్.. సమస్యల పరిష్కారానికి నోడల్ ఆఫీసర్స్

రాష్ట్రంలోని సాంఘీక సంక్షేమ గురుకులాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గురుకుల విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన వసతులు కల్పించడం విద్యార్థులకు ఏమైనా ఇబ్బందులు ఏర్పడితే వాటిని వేగంగా పరిష్కరించడంతో పాటు మెరుగైన పర్యవేక్షణ చేయాలని జిల్లా అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించడానికి నోడల్ అధికారులను నియమించాలని ఈ మేరకు తాజాగా ఆదేశాలు జారీ చేసింది. డిటైల్డ్ ఎంక్వైరీ క్యాలెండర్‌ను ముందుగానే తయారు చేసి వాటిని జిల్లా షెడ్యూల్‌కు అనుగుణంగా సంబంధిత అన్ని విభాగాలకు అందజేయాలని స్పష్టం చేసింది.

**నివేదికలు వెంటనే అప్ లోడ్:**

నోడల్ అధికారులు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం తనిఖీలు నిర్వహించాలని విద్యా సంస్థల సరైన పనితీరును నిర్ధారించడానికి ఆకస్మిక సందర్శనలను కూడా నిర్వహిస్తారని ఈ ఆదేశాల్లో వెల్లడించింది. అధికారులు గురుకుల పాఠశాలలను సందర్శించిన తర్వాత అవసరమైన చర్యలు తీసుకోవడానికి తనిఖీ నివేదికలను తయారు చేసి వెంటనే అప్‌లోడ్ చేయాలని పేర్కొంది. ఏ చర్యలు తీసుకున్నారో వెంటనే తెలియజేయాలని జిల్లా అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. తీసుకున్న చర్యల నివేదికను ప్రతి నెల అయిదో తేదీలోపు సంబంధిత విభాగాధిపతులు, కార్యదర్శులకు తప్పకుండా సమర్పించాలని ఆదేశాల్లో పేర్కొంది.



## హైదరాబాద్‌లోని చట్నీస్ హోటల్‌లో భారీ పేలుడు

* అధిక వేడి కారణంగా స్టీమర్ పేలినట్లు ప్రాథమికంగా నిర్ధారించిన పోలీసులు
* బయటకు పరుగుతీసిన సిబ్బంది, కస్టమర్లు
* ప్రమాదంలో ముగ్గురికి గాయాలు, ఆసుపత్రికి తరలింపు

హైదరాబాద్ నగరంలోని ఓ హోటల్లో భారీ పేలుడు సంభవించింది. అధిక వేడి కారణంగా ఇడ్లీ స్టీమర్ పేలిపోయినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఎల్బీనగర్‌లోని ఆర్కేపురం చట్నీస్ హోటల్‌లో మధ్యాహ్నం పేలుడు జరిగింది. ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలుడు చోటు చోసుకోవడంతో హోటల్ సిబ్బంది, కస్టమర్లు బయటకు పరుగు తీశారు. ఈ ఘటనలో ముగ్గురు సిబ్బందికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. పోలీసులు, హైడ్రా సిబ్బంది, బాంబు స్క్వాడ్ బృందాలు కిచెన్‌ను పరిశీలించాయి.

## మైత్రివనం ఆదిత్య ఎన్‌క్లేవ్‌లో అగ్ని ప్రమాదం... తప్పిన ముప్పు

* రాందేవ్ ఇన్ఫోటెక్, శివమ్ టెక్నాలజీ దుకాణాల్లో మంటలు
* సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక, హైడ్రా సిబ్బంది, పోలీసులు
* ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరిపీల్చుకున్న అధికారులు

హైదరాబాద్‌లోని అమీర్‌పేట చౌరస్తా మైత్రివనం వద్ద ఉన్న ఆదిత్య ఎన్‌క్లేవ్ భవనం మొదటి అంతస్తులో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. నీలగిరి బ్లాక్‌లోని రాందేవ్ ఇన్ఫోటెక్, శివమ్ టెక్నాలజీ దుకాణాలలో మంటలు అలముకున్నాయి. ఈ భవనంలో కోచింగ్ సెంటర్‌లు ఉంటాయి. దీనితో ఆయా




కోచింగ్ సెంటర్‌లలోని విద్యార్థులు కిందకు వచ్చేశారు. విద్యార్థులను పోలీసులు, హైడ్రా సిబ్బంది నిచ్చెనల ద్వారా కూడా సురక్షితంగా తీసుకువచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేసింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. ప్రమాదం విషయం తెలియగానే పోలీసులు, అగ్నిమాపక సిబ్బందితో పాటు హైడ్రా సిబ్బంది హుటాహుటిన మైత్రివనంకు తరలి వచ్చారు. గ్రౌండ్ ఫ్లోర్‌లోని ప్యానెల్ బోర్డులో షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. మొదటి అంతస్తు వరకు మంటలు రావడం, పొగలు రెండో అంతస్తు వరకు వ్యాపించడంతో భవనాన్ని ఖాళీ చేయించారు.

## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన సబ్ రిజిస్ట్రార్

* లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ మంథని సబ్ రిజిస్ట్రార్
* భూమి రిజిస్ట్రేషన్ కోసం రూ.16,500 డిమాండ్
* ప్రైవేట్ డాక్యుమెంట్ రైటర్ ద్వారా డబ్బు స్వీకరిస్తూ అరెస్ట్
* అవినీతిపై 1064కు ఫిర్యాదు చేయాలని సూచించిన ఏసీబీ



పెద్దపల్లి: జిల్లాలోని మంథనిలో ఓ ప్రభుత్వ అధికారి లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. మంథని సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న కాసర్ల రాజేందర్, భూమి రిజిస్ట్రేషన్ కోసం లంచం స్వీకరిస్తుండగా అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే, ఒక వ్యక్తి కొనుగోలు చేసిన భూమిని రిజిస్ట్రేషన్ చేసేందుకు సబ్ రిజిస్ట్రార్ రాజేందర్ రూ. 16,500 లంచం డిమాండ్ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో వలపన్నారు. రాజేందర్ సూచన మేరకు, బాధితుడు ఆ డబ్బును రషీద్ అనే ప్రైవేట్ డాక్యుమెంట్ రైటర్‌కు మంథని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇస్తుండగా ఏసీబీ అధికారులు వారిని పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఏసీబీ అధికారులు ప్రజలకు కీలక సూచన చేశారు. ఏ ప్రభుత్వ అధికారి అయినా లంచం డిమాండ్ చేస్తే, తమ టోల్ ఫ్రీ నంబర్ 1064కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు. వాట్సాప్ (9440446106), ఫేస్‌బుక్, అధికారిక వెబ్‌సైట్ ద్వారా కూడా తమను సంప్రదించవచ్చని తెలిపారు. ఫిర్యాదుదారుల వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.




## రెండు రోజుల వ్యవధిలోనే నాంపల్లి కోర్టుకు మరోసారి బాంబు బెదిరింపులు


* ఈమెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు
* బాంబు పేలబోతోందని బెదిరించిన దుండగులు
* బాంబు, డాగ్ స్క్వాడ్ తో తనిఖీలు నిర్వహించిన పోలీసులు

హైదరాబాద్ నాంపల్లిలోని సీబీఐ కోర్టుకు మరోసారి బాంబు బెదిరింపులు వచ్చాయి. దుండగులు ఈమెయిల్ ద్వారా కోర్టు సిబ్బందికి ఈరోజు బెదిరింపులు పంపారు. కోర్టు ప్రాంగణంలో బాంబు అమర్చామని, దానికి టైం కూడా సెట్ చేశామని, బాంబు పేలబోతోందని ఈమెయిల్ ద్వారా బెదిరించారు. వెంటనే కోర్టు సిబ్బంది పోలీసులు, క్విక్ రెస్పాన్స్ టీమ్, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించగా నిమిషాల వ్యవధిలోనే వారు కోర్టు వద్దకు చేరుకున్నారు. అప్పటికే అక్కడున్న న్యాయవాదులు, కక్షిదారులను బయటకు పంపించారు. బాంబు, డాగ్ స్క్వాడ్ తో తనిఖీలు నిర్వహించారు. ఈనెల 18వ తేదీ కూడా నాంపల్లి కోర్టుకు బాంబు బెదిరింపులు వచ్చాయి. అదే రోజున కరీంనగర్, అనంతపురం, రాజమండ్రి కోర్టులకు కూడా బెదిరింపులు రావడం గమనార్హం. అయితే, ఆయా కోర్టుల్లో నిర్వహించిన తనిఖీల్లో బాంబుల ఆచూకీ లభించలేదు. ఇవన్నీ నకిలీ బెదిరింపులుగా పోలీసులు నిర్ధారించారు.

## వేసవి రద్దీ.. డేటా ఆధారిత ప్రణాళికతో మెరుగైన సౌకర్యాలు

: **తితిదే అదనపు ఈవో**

తిరుమల: వేసవిలో తిరుమలకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి తెలిపారు. డేటా ఆధారిత ప్రణాళికతో భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించనున్నట్లు చెప్పారు. సామాన్య భక్తులకు వీలైనంత త్వరగా దర్శనం కల్పించేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. త్వరలో పాఠశాలలు, కళాశాలలకు వేసవి సెలవులు ప్రకటించనున్న నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చేయాల్సిన ఏర్పాట్లపై తిరుమలలోని పద్మావతి అతిథి గృహంలో అధికారులతో సమీక్షించారు. అనంతరం వెంకయ్య చౌదరి మాట్లాడుతూ.. ''గత రెండు, మూడు సంవత్సరాల వేసవి డేటాను విశ్లేషిస్తున్నాం. దర్శనాల సంఖ్య, వేచి ఉండే సమయం, తర్వాత రోజు దర్శనాలకు క్యూలైన్లలో వేచి ఉండే భక్తుల సంఖ్య వంటి అంశాలపై దృష్టి సారించాం. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అన్నప్రసాదం, తాగునీటి పంపిణీ, నడక దారి భక్తులకు మార్గమధ్యంలో షెడ్ల ఏర్పాటు, మాడ వీధులు, అవసరం ఉన్న చోట్ల కూల్ పెయింటింగ్ వేయడం, మజ్జిగ పంపిణీ పాయింట్ల సంఖ్యను పెంచి వేసవిలో భక్తుల దాహార్తిని తీర్చేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. వేసవి సెలవుల్లో కుటుంబాలతో కలిసి అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున వసతి సదుపాయాలు, అన్నప్రసాదం పంపిణీ నిర్వహణను మరింత సమర్థంగా అమలు చేయాలని నిర్ణయించాం. నడకదారి భక్తులు, అధిక రద్దీ ప్రాంతాల్లో వైద్య సదుపాయాలను బలోపేతం చేసి మరింత మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు చేపట్టాం. సామాన్య భక్తులు దర్శనం కోసం వేచి ఉండే సమయాన్ని తగ్గించి వీలైనంత త్వరగా దర్శనం కలిగేలా చర్యలు తీసుకుంటాం. ఇంటిగ్రేటెడ్ ఏఐ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా టెక్నాలజీ వినియోగాన్ని మరింత పెంచి.. గంటల వారీగా ఇన్ అండ్ అవుట్ ఫ్లో, వేచి ఉండే సమయాన్ని ప్రతి నిమిషం పర్యవేక్షిస్తాం. అవసరమైన చోట తక్షణ నిర్ణయాలు తీసుకుంటాం. వివిధ కేటగిరీల దర్శనాలను డేటా ఆధారంగా.. కంపార్ట్‌మెంట్లు, క్యూ లైన్లలో భక్తులు




వేగంగా దర్శనం పొందేలా చర్యలు తీసుకుంటాం. వేసవిలో భక్తులకు వేగవంతమైన, సౌకర్యవంతంగా దర్శనం కల్పించడమే లక్ష్యంగా తితిదేలోని అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తాయి'' అని తెలిపారు.

## జర్నలిస్టుల అక్రెడిటేషన్ కార్డుల అప్‌డేట్

జిల్లాస్థాయి అక్రెడిటేషన్ కమిటీలను వారం రోజులలో పూర్తి చేయాలని డీపీఆర్‌వోలను సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సీహెచ్ ప్రియాంక ఆదేశించారు. శుక్రవారం నాంపల్లిలోని తెలగాంణ మీడియా అకాడమీ ఆడిటోరియంలో అక్రెడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియ విధి విధానాలపై డీపీఆర్‌వోలకు, క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జీఓ నెం.252, 103లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని పీఆర్‌వోలకు సూచించారు. జిల్లాస్థాయి అక్రెడిటేషన్ కమిటీలను సంబంధిత జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకుని స్థానిక ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ ప్రతినిధులతో ఒక కమిటీని వారం రోజులలో పూర్తి చేయాలని ఆమె వెల్లడించారు.

* **అధికారులతో సమన్వయం చేసుకోవాలి..**

ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా, ఫ్రిలాన్స్, వెటరన్ జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల నమోదు, దరఖాస్తుల





పరిశీలన, రిపోర్టులు, అప్రూవుడ్ లిస్టులు, రిజిస్ట్రేషన్ నెంబర్ అలాట్ మెంట్, అక్రెడిటేషన్ కార్డుల డౌన్ లోడింగ్, మొదలగు అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆమె సంబంధిత అధికారులను కోరారు. అదే విధంగా అక్రెడిటేషన్ కార్డుల ప్రక్రియలో భాగంగా ఆన్ లైన్, ఇతర సమస్యలు తలెత్తితే వెంటనే రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో మీడియా రిలేషన్ వింగ్ అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలన్నారు. సాంకేతిక సమస్యలు ఉంటే టెక్నికల్ టీమ్ ప్రధాన కార్యాలయంలో అందుబాటులో ఉంటారని వారిని కూడా సంప్రదించి ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా అక్రెడిటేషన్ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆమె కోరారు.

* **సందేహాల నివృత్తికి కాల్ చేయండి..**

ఈ శిక్షణా కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల డీపీఆర్‌వోలు సంబంధిత సిబ్బంది హాజరయ్యారు. శిక్షణలో భాగంగా క్షేత్రస్థాయి అధికారులకు అక్రెడిటేషన్ కార్డుల జారీపై ఆన్ లైన్ విధి విధానాలపై క్షేత్రస్థాయి సిబ్బందికి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కలిగించారు. శిక్షణలో భాగంగా క్షేత్రస్థాయి సిబ్బంది లేవనెత్తిన అంశాలపై మీడియా రిలేషన్ విభాగం అధికారులు డీ.ఎస్.జగన్, యామిని, వెబ్ సైట్ టీమ్ మేనేజర్ నంద, టెక్నిషన్ సాయిలు అధికారుల సందేహాలను నివృత్తి చేశారు. అర్హత గల జర్నలిస్టులు http://ipr.telangana.gov.in ద్వారా ఆన్ లైన్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఏమైనా సందేహాలు ఉంటే సెల్ నెం.9154170881ను సంప్రదించాలని తెలియజేశారు.

## తెలంగాణ నీటివాటాను కాపాడటంలో సీఎం విఫలం: మాజీ మంత్రి హరీశ్‌రావు

ధర్మసాగర్: గోదావరి, కృష్ణా నదుల నీటిపై తెలంగాణ వాటాను కాపాడటంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విఫలమవుతున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ఉనికిచర్ల శివారులోని దేవాదుల ఎత్తిపోతల పథకం దేవన్నపేట పంప్‌హౌస్‌ను మాజీ ఎమ్మెల్యేలు, భారాస నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ.. ''గోదావరి నదిపై నల్లమల్లసాగర్ నిర్మిస్తామంటూ చంద్రబాబు నీళ్లు తీసుకుపోయే ప్రయత్నం చేస్తే రేవంత్‌రెడ్డి ఏమీ మాట్లాడరు. మేడిగడ్డ వద్ద బ్యారేజీకి మరమ్మతులు చేయమంటే చేయరు. గోదావరిలో దేవాదుల వద్ద నీటిని పెంచరు.. మోటార్లు ఆన్ చేయరు'' అని విమర్శించారు. ''మేడిగడ్డ వద్ద మోటార్లు ఆన్ చేయకుండా గోదావరి జలాలను గురుదక్షిణగా ఆంధ్రాకు వదులుతున్నారా'' అని ప్రశ్నించారు. అలాగే కృష్ణా నదిలో అత్యంత తక్కువ నీటి వినియోగం చేశారన్నారు. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి కృష్ణా నది నీటిని ఇంత తక్కువ ఎప్పుడూ వాడుకోలేదన్నారు. తాత్కాలిక ఒప్పందం ప్రకారం 34 శాతం నీటిని



వాడుకోవడంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. హరీశ్‌రావు వెంట మాజీ ఎమ్మెల్యేలు ఆరూరి రమేష్, దాస్యం వినయ్‌భాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి జీవన్‌రెడ్డికి అస్వస్థత...

హైదరాబాద్: కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి అస్వస్థతకు గురయ్యారు. నిన్నరాత్రి నుంచి వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నారు. దీంతో కుటుంబ సభ్యులు బేగంపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. నాయకులు, కార్యకర్తలు ఆందోళన చెందవద్దని, రెగ్యులర్ చెకప్ కోసమేనని కుటుంబ సభ్యులు తెలిపారు.

**అడ్లూరి లక్ష్మణ్ పరామర్శ**

ధర్మపురి గ్రామీణం: అస్వస్థతకు గురై సికింద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జీవన్‌రెడ్డిని సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యుల్ని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# సునీత యాత్ర.. 'కల్పనా చావ్లా' తరహా ప్రాణాంతక వైఫల్యమే: నాసా సంచలన నివేదిక

భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ వారం రోజుల అంతరిక్ష యాత్ర కాస్తా.. అనివార్యకారణాల వల్ల నెలల పాటు గడిచింది. యావత్ ప్రపంచం ఉత్కంఠగా చూసిన ఆ రోదసి యాత్రపై అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా తాజాగా ఓ నివేదిక విడుదల చేసింది. ఆ మిషన్ 'ప్రాణాంతక వైఫల్యమేనని' అంగీకరించింది. దానిని 'టైప్ఏ' ప్రమాదంగా అభివర్ణించింది. వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్‌మోర్ ప్రయాణించిన బోయింగ్ స్టార్‌లైనర్ మిషన్‌పై నాసా 311 పేజీల నివేదిక విడుదల చేసింది. ఈ సందర్భంగా నాసా చీఫ్ జేర్డ్ ఐజాక్‌మ్యాన్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. భద్రతాపరమైన హెచ్చరికలను విస్మరించి నాటి నాసా మేనేజ్‌మెంట్, బోయింగ్ మిషన్‌పై ముందుకెళ్లారని వెల్లడించారు. "2024 జూన్‌లో ఈ మిషన్‌ను ప్రయోగించిన వెంటనే సమస్య మొదలైంది. రాకెట్‌కు థ్రస్ట్‌ను ఉత్పత్తి చేసే స్పేస్‌క్రాఫ్ట్ ప్రొపల్షన్ వ్యవస్థ విఫలమవడం ప్రారంభించింది. స్పేస్ స్టేషన్‌కు సమీపిస్తుండగానే ఐదు థ్రస్టర్లు పనిచేయడం ఆగిపోయాయి. దీనికితోడు హీలియం లీకేజీ మరింత భయపెట్టింది. అయితే, అదృష్టవశాత్తూ డాకింగ్ సురక్షితంగా పూర్తవడంతో వ్యోమగాములు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోకి వెళ్లగలిగారు" అని ఈ నివేదికలో వెల్లడించారు. భద్రతాపరమైన ప్రొటోకాల్స్‌ను పక్కనబెట్టి ప్రయోగాన్ని అనుకున్న షెడ్యూల్‌కు చేపట్టేలా నాసా మేనేజర్లపై ఒత్తిడి తెచ్చినట్లు దర్యాప్తులో గుర్తించారు. ఈ మిషన్‌ను టైప్ఏ వైఫల్యంగా ధ్రువీకరించడంతో వ్యోమగాముల ప్రాణాలను పణంగా పెట్టి ప్రయోగం చేపట్టామని నాసా అంగీకరించినట్లయ్యింది.

**ఏంటీ టైప్-ఏ ప్రమాదం..?**

ఈ మిషన్‌ను నాసా 'టైప్ఏ' ప్రమాదంగా ప్రకటించడం ఏరోస్పేస్ ఇండస్ట్రీని షాక్‌కు గురిచేసింది. సాధారణంగా అత్యంత విపత్కర యాక్సిడెంట్లకు దీన్ని పేర్కొంటారు.



2003లో జరిగిన కొలంబియా షటిల్ డిజాస్టర్‌ను 'టైప్ ఏ' ప్రమాదంగా పిలుస్తారు. ఆ ప్రమాదంలోనే భారత అమెరికన్ వ్యోమగామి కల్పనా చావ్లా సహా మరో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. అప్పుడు కూడా ఇంజినీర్ల ఆందోళనలను పట్టించుకోకుండా మిషన్‌ను ప్రయోగించడంతో ఆ విషాదం చోటుచేసుకుంది. గతేడాది జూన్ 5న ప్రయోగించిన బోయింగ్ వ్యోమనౌక 'స్టార్‌లైనర్'లో సునీత, విల్మోర్‌లు ఐఎస్ఎస్‌కు వెళ్లారు. ప్రణాళిక ప్రకారం వీరు 8 రోజులకే భూమిని చేరుకోవాల్సి ఉంది. అయితే, స్టార్‌లైనర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో వ్యోమగాములు లేకుండానే అది భూమికి తిరిగొచ్చింది. అనంతరం వీరిని తీసుకొచ్చేందుకు బోయింగ్ అనేక ప్రయత్నాలు చేసింది. చివరకు తొమ్మిది నెలల తర్వాత 2025 మార్చిలో వీరిద్దరూ సురక్షితంగా భూమిని చేరుకున్నారు.



## సిగరెట్ కాల్చొద్దన్నందుకు..
# ఫ్యుయల్ ట్యాంక్‌కు నిప్పంటించి..!

పెట్రోల్ బంక్‌లో సిగరెట్ కాల్చొద్దని చెప్పినందుకు ఓ వ్యక్తి ఫ్యుయల్ ట్యాంక్‌కు నిప్పంటించిన ఘటన ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో చోటుచేసుకుంది. ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వీడియో ప్రకారం.. ఫిబ్రవరి 18న రాత్రి 7:40 గంటల సమయంలో రాయ్‌పూర్‌లోని ఒక పెట్రోల్ పంపు వద్దకు ఇద్దరు వ్యక్తులు వచ్చారు. వారిలో ఒకరు బైక్‌లో పెట్రోల్ పోయిస్తుంటే, మరొక వ్యక్తి పక్కనే నిలబడి లైటర్‌తో సిగరెట్ అంటించడానికి ప్రయత్నించాడు. బండిపై ఉన్న వ్యక్తి సిగరెట్ తాగొద్దని వారించగా.. వెంటనే అతడు తన చేతిలోని లైటర్‌ను మోటార్ సైకిల్ ఫ్యుయల్ టాంక్‌లో పడేశాడు. దీంతో బైక్‌కు మంటలు అంటుకున్నాయి. అప్రమత్తమైన పెట్రోల్ బంక్ సిబ్బంది వెంటనే మంటలు ఆర్పడంతో ప్రమాదం తప్పింది. అనంతరం అక్కడి నుంచి పారిపోవడానికి ప్రయత్నించిన ఇద్దరు వ్యక్తులను బంకు సిబ్బంది పట్టుకొని పోలీసులకు అప్పగించారు.

# 'సర్' విధుల్లో జ్యుడిషియల్ అధికారులు.. సుప్రీం అసాధారణ నిర్ణయం


పశ్చిమ బెంగాల్‌లో కొనసాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం మధ్య నిందల పర్వం కొనసాగుతోందని సుప్రీం కోర్టు పేర్కొంది. ఇది దురదృష్టకర పరిణామమని అభిప్రాయపడింది. ఈ సందర్భంగా అసాధారణ నిర్ణయం తీసుకున్న సర్వోన్నత న్యాయస్థానం.. ఈ ప్రక్రియలో సాయం చేసేందుకు జ్యుడిషియల్ అధికారులను నియమించాలని హైకోర్టును ఆదేశించింది. ఎస్ఐఆర్ దరఖాస్తులపై వచ్చే అభ్యంతరాలను ఈ అధికారులు పరిశీలిస్తారని స్పష్టం చేసింది. రాష్ట్రంలో కొనసాగుతున్న 'సర్' ప్రక్రియ పరిశీలనకు గ్రేడ్ ఏ అధికారులను రాష్ట్ర



ప్రభుత్వం నియమించకపోవడంపై సుప్రీం కోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం తీరును ప్రస్తావిస్తూ.. "రెండు రాజ్యాంగబద్ధ విభాగాల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణల పర్వం కొనసాగుతుండటం దురదృష్టకర పరిణామం. ఇది వ్యవస్థల మధ్య అపనమ్మకాన్ని రుజువు చేస్తోంది. అభ్యంతరాల స్వీకరణ దశలో ఈ ప్రక్రియ ఆగిపోయింది" అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. ఈ నేపథ్యంలోనే 'సర్' ప్రక్రియ కోసం జ్యుడిషియల్ అధికారులతోపాటు మాజీ న్యాయమూర్తుల సాయం తీసుకోవాలని, సంబంధిత అధికారులను నియమించుకోవాలంటూ కలకత్తా హైకోర్టుకు ఆదేశాలు జారీ చేసింది.

# ఏఐ సదస్సులో 8 ఏళ్ల బుడతడు.. ఎవరీ రణ్‌వీర్ సచ్‌దేవా?

దేశ రాజధాని దిల్లీలో జరిగిన 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సు'లో పలువురు దేశాధినేతలు, అనేక మంది టెక్ దిగ్గజాలు, విద్యావేత్తలు పాల్గొని తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ క్రమంలో 8 ఏళ్ల ఓ బుడతడు ఈ అంతర్జాతీయ సదస్సులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. సదస్సులో అతిపిన్న కీనోట్ స్పీకర్‌గా నిలిచి అందర్నీ ఆశ్చర్యపరచడమే కాకుండా.. సుందర్ పిచాయ్, శామ్ ఆల్ట్‌మన్‌లతోనూ భేటీ అయ్యాడు. సోషల్ మీడియాలో మరోసారి వైరల్‌గా మారిన ఆ బాలుడే రణ్‌వీర్ సచ్‌దేవా. దిల్లీకి చెందిన రణ్‌వీర్ సచ్‌దేవా నగరంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నాడు. నాలుగేళ్ల వయసు నుంచే సాంకేతిక అంశాలపై అసాధారణ ప్రతిభ కనబరుస్తున్నాడు. కష్టమైన ఏఐ అంశాలనూ సులభంగా వివరిస్తుండటం అతడికి గుర్తింపు తెచ్చిపెట్టింది. ఆరేళ్ల వయసు ఉన్నప్పుడే టెక్నాలజీ, ఆవిష్కరణలపై టెడెక్స్ వేదికపై ప్రసంగించి అందరి దృష్టిని ఆకర్షించాడు. ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఇప్పటికే చోటు సాధించాడు. గతేడాది కేంద్ర విద్యాశాఖ నిర్వహించిన ఓ జాతీయస్థాయి వేడుకలోనూ కృత్రిమ మేధ, ఇతర అంశాలపై ప్రసంగించి అనేక మంది ప్రశంసలు అందుకున్నాడు. అంతేకాదు.. సచ్‌దేవా ఇప్పటికే ఓ పుస్తకం కూడా రాసినట్లు సమాచారం. ఏఐ ఇంపాక్ట్ సదస్సులో కీలక ప్రసంగం చేసిన సచ్‌దేవా.. రోజువారీ జీవితంలో ఏఐకి పెరుగుతున్న ప్రాధాన్యంపై మాట్లాడాడు. ప్రాచీన భారతీయ తత్వాలను ఆధునిక సాంకేతికత ఎలా అనుసంధానిస్తుందనే విషయాన్ని ప్రధానంగా ప్రస్తావించాడు. జాతీయ పురోగతికి ఆవిష్కరణ ఏవిధంగా



దోహదపడుతుందో సొంత అనుభవంతో వివరించాడు.

## నాడు రాష్ట్రంలో ధృతరాష్ట్ర పాలన
# లాలూను ఎద్దేవా చేసిన బిహార్ ఎమ్మెల్యే


పట్నా: ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్‌పై గాయని, బిహార్ యంగ్ ఎమ్మెల్యే మైథిలీ ఠాకూర్ తీవ్ర విమర్శలు చేశారు. లాలూ ప్రభుత్వం ఉన్న సమయంలో ఆయన పాలన గురించి ఆలోచించిన ప్రతిసారీ తనకు ధృతరాష్ట్రుడి పాలన గుర్తుకువచ్చేదని అన్నారు. మహాభారతంలో ధృతరాష్ట్రుడు రాజ్యం కోసం కాకుండా కొడుకు దుర్యోధనుడి కోసం ఆందోళన చెందినట్లు.. లాలూ కూడా ప్రజల గురించి కాకుండా తేజస్వీ యాదవ్ రాజకీయ జీవితం కోసం తపించేవారని ఎద్దేవా చేశారు. ప్రజల బాధలు ఆయన కంటికి కనిపించేవి కావన్నారు. బిహార్ అసెంబ్లీలో మాట్లాడుతూ మైథిలి ఈ వ్యాఖ్యలు చేశారు. లాలూ పాలనలో బిహార్ విద్యకు దూరమైందని మైథిలి పేర్కొన్నారు. దానివల్ల ఎన్నో తరాలు ఉపాధి, అభివృద్ధి లేక ఇప్పటికీ బాధ పడుతున్నాయన్నారు. 2006లో నీతీశ్ పాఠశాల విద్యార్థినులకు ఉచిత సైకిళ్లు ఇవ్వడం ప్రారంభించిన తర్వాత రాష్ట్రంలో బాలికలు పాఠశాలలకు వెళ్లడం ప్రారంభించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ప్రారంభించినప్పుడు ప్రతిపక్షాలు ఎన్డీఏ ప్రభుత్వాన్ని ఎగతాళి చేశాయని.. ఇప్పుడు అదే పథకం దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా



నిలిచిందని వెల్లడించారు. 2005కి ముందు రాష్ట్రంలో గూండాల ప్రభావం ఎక్కువగా ఉండేదని.. సాయంత్రం 5 గంటల తర్వాత ఇళ్ల నుంచి బయటకు వెళ్లడానికి కూడా ప్రజలు భయపడేవారన్నారు. ప్రస్తుతం ఎన్డీఏ పాలనలో మారుమూల ప్రాంతమైన మధుబనిలో ఉన్న తన ఇంటికి అర్ధరాత్రి కూడా సురక్షితంగా వెళ్లగలుగుతున్నానని పేర్కొన్నారు. నీతీశ్ సుపరిపాలన వల్లే ఇది సాధ్యమయ్యిందన్నారు. ఎన్డీఏ పాలనలో బిహార్ అభివృద్ధి బాటలో నడుస్తోందన్నారు.

# వ్యాపారి ఇంట్లో సీక్రెట్ వాల్.. దాని వెనుక రూ.కోట్ల బంగారం

పాత సినిమాల్లో చూపించినట్టుగా రాజస్థాన్‌లోని ఒక వ్యాపారి ఇంట్లో సీక్రెట్ వాల్.. దానివెనక రూ.కోట్లు విలువచేసే బంగారమున్న స్ట్రాంగ్‌రూమ్ బయటపడింది. ఇదంతా చూసి ఐటీ సోదాలకు వచ్చిన అధికారులు విస్తుపోయారు. రూ.100కోట్ల పన్ను ఎగవేత ఆరోపణల్లో భాగంగా కన్హా గ్రూప్ కార్యాలయాల్లో సోదాలు జరిగాయి. జాతీయ మీడియా కథనాల ప్రకారం.. . ప్రముఖ ఫుడ్ అండ్ బెవరెజ్ సంస్థ కన్హా గ్రూప్ పై పన్ను ఎగవేత ఆరోపణలు రావడంతో మూడు రోజులుగా ఐటీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. మొత్తం ఆరు నగరాల్లో ఉన్న 33 ప్రాంతాల్లో బుధవారం నుంచి తనిఖీలు జరుగుతున్నాయి. తొలి రెండు రోజుల్లో గ్రూప్ యజమాని ఇల్లు, ఆఫీస్‌లో అనుమానాస్పద దస్త్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇక మూడో రోజు సోదాల్లో వారికి సీక్రెట్ వాల్ కనిపించింది. దానిని బద్దలుకొట్టి చూడగా.. వెనక ఒక రూమ్ ఉంది. దానిలో కోట్లు విలువచేసే బంగారు నగలు ఉన్నాయి. ఇప్పుడు ఆ మొత్తాన్ని లెక్కిస్తున్నారు. భారీగా వెలుగుచూసిన ఈ సంపద దర్యాప్తు తీరునే మార్చి వేయనుందని అధికారులు పేర్కొన్నారు. ఇది కేవలం పన్ను ఎగవేత




కిందికే రాదని, ప్రభుత్వం కళ్లు గప్పి సంపదను దాచి పెట్టడానికి చేసిన పక్కా ప్లాన్ అని వెల్లడించారు. బంగారంతో పాటు రూ.50లక్షల మేర నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ గ్రూప్‌నకు చెందిన పది బ్యాంక్ లాకర్లు బయటపడ్డాయి. వాటిలో కూడా లెక్కలోకి రాని నగదు, బంగారం ఉండొచ్చని భావిస్తున్నారు. 2008లో ఈ కన్హా గ్రూప్‌ను నట్వర్‌లాల్ స్థాపించారు. ఈ సంస్థ స్వీట్స్, బేకరీ ఉత్పత్తులను విక్రయిస్తోంది. దీని యజమానులు రూ.100 కోట్ల వరకు పన్ను ఎగవేతకు పాల్పడి, ఆ మొత్తాన్ని లగ్జరీ హోటళ్లలో పెట్టుబడి పెట్టారన్న ఆరోపణలు ఉన్నాయి. ఆ హోటళ్లలోనూ ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు.




# చెత్తతో పాటే రూ.15 లక్షల బంగారు ఆభరణాల సంచి.. 4 నెలల తర్వాత చెంతకు!

హరియాణాలోని ఫరీదాబాద్‌లో ఆసక్తికర సంఘటన వెలుగుచూసింది. పొరపాటున చెత్తతో పాటు వెళ్లిపోయిన లక్షల రూపాయల విలువైన బంగారాన్ని.. ఓ స్క్రాప్ డీలర్ తిరిగి యజమానికి అప్పగించి తన నిజాయితీని చాటుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గతేడాది అక్టోబర్‌లో దీపావళి పండగ సందర్భంగా ఫరీదాబాద్‌కు చెందిన అశోక్ శర్మ ఇంటిని శుభ్రం చేసి.. చెత్తను స్థానిక స్క్రాప్ డీలర్ అక్తర్ ఖాన్‌కు విక్రయించారు. చెత్తతో పాటు పొరబాటున రూ.15 లక్షల విలువైన బంగారు నగలు ఉన్న సంచి కూడా అందులో ఉంది. కొన్ని రోజుల అనంతరం ఇంట్లో బంగారం లేనట్లు గుర్తించిన అశోక్ శర్మ కుటుంబం స్క్రాప్ డీలర్‌ను సంప్రదించింది. వారు ఎంత వెతికినప్పటికీ ఆభరణాలు దొరక్కపోవడంతో నిరాశతో తిరిగివచ్చారు. నాలుగు నెలల తర్వాత చెత్తను వేరు చేస్తున్న సమయంలో అందులో బంగారు ఆభరణాలు ఉన్న కవర్‌ను అక్తర్ ఖాన్ గుర్తించాడు. వెంటనే వాటిని పోలీసులకు అప్పజెప్పాడు. అప్పటికే నమోదైన కేసు ఆధారంగా అశోక్ శర్మ కుటుంబాన్ని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించిన పోలీసులు అక్తర్ ఖాన్ చేతులమీదుగా ఆభరణాలను వారికి ఇప్పించారు. నిజాయతీగా బంగారు ఆభరణాలను తిరిగి ఇచ్చినందుకు అతడిని ప్రశంసించారు.

# అందమైన విషం.. ఈ లేడీ డాన్: పోలీసులకు చిక్కిన 'మేడమ్ జహర్'

దేశ రాజధాని దిల్లీలో మరో 'లేడీ డాన్' వ్యవహారం వెలుగుచూసింది. పగలు బ్యూటీ పార్లర్ నడుపుతూ సాదాసీదాగా కన్పించే ఆమె.. రాత్రిపూట భారీ డ్రగ్ సిండికేట్‌ను శాసిస్తోంది. గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ ముఠా కోసం పనిచేస్తోన్న లేడీ డాన్ ఖుస్నుమా అన్సారీ అలియాస్ నేహను దిల్లీ పోలీసులు తాజాగా అరెస్ట్ చేశారు. పక్కా సమాచారంతో నిఘా పెట్టి ఆమె ఆట కట్టించారు. వివరాల్లోకి వెళితే.. ఇటీవల దిల్లీలోని మహిపాల్‌పుర్ ఫ్లైఓవర్ ప్రాంతంలో పోలీసులు భారీఎత్తున డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆ కేసు దర్యాప్తు చేస్తుండగా పోలీసులకు 'మేడమ్ జహర్' పదం వినిపించింది. దీంతో తీగ లాగితే ఈ లేడీ డాన్ వ్యవహారం బయటపడింది. ఈశాన్య దిల్లీ (Delhi)లో బ్యూటీపార్లర్ నడిపే ఖుస్నుమానే ఈ 'మేడమ్ జహర్' అని



పోలీసులు గుర్తించారు. గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్, హషీమ్ బాబా ముఠాలకు ఆయుధాలు సరఫరా చేసే బాబీ కబూతర్‌కు ఈమె దీర్ఘకాల స్నేహితురాలు. ఖుస్నుమా గత కొన్నేళ్లుగా దిల్లీలో డ్రగ్ సిండికేట్ నిర్వహిస్తోంది. ఈ అక్రమ వ్యాపారం బయటపడకుండా ఉండేందుకు బ్యూటీపార్లర్ ముసుగులో పగటిపూట సాదాసీదాగా కన్పిస్తోందని పోలీసులు వెల్లడించారు. డ్రగ్ డీలర్లు ఆమెను 'మేడమ్ జహర్' అని పిలుస్తారని దర్యాప్తులో గుర్తించారు. జహర్ అంటే తెలుగులో విషం అని అర్థం. నిఘా వర్గాల సమాచారం ఆధారంగా ఈ లేడీ డాన్‌తో పాటు ఆమె స్నేహితుడు బాబీ కబూతర్, మరో ఇద్దరిని దిల్లీ పోలీసులు స్పెషల్ సెల్ విభాగం అరెస్ట్ చేసింది. వీరి నుంచి మరిన్ని వివరాలు రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ముఠా ఆర్థిక కార్యకలాపాలు, ఇతర స్లీపర్ సెల్స్ గురించి తెలుసుకునేందుకు దర్యాప్తు చేస్తున్నామన్నారు. బాబీ కబూతర్ అసలు పేరు మహ్‌ఫూజ్. పాక్ ఐఎస్ఐతో సంబంధం ఉన్న సలీమ్ పిస్టోల్ అనే అక్రమాయుధాల డీలర్ నుంచి ఇతడు ఆయుధాలు కొనుగోలు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఆ మధ్య పంజాబ్‌లో జరిగిన సిద్ధూ మూసేవాలా హత్య, నటి దిశా పటానీ ఇంటి వద్ద కాల్పుల ఘటనల్లో బాబీ ఇచ్చిన ఆయుధాలనే వినియోగించినట్లు ప్రాథమికంగా నిర్ధరించారు. కాగా.. ఇటీవల గ్యాంగ్‌స్టర్ల కోసం పనిచేసిన లేడీ డాన్‌లు దీప, జోయా ఖాన్‌ను కూడా దిల్లీ పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే.

# ఫ్లోరిడా ఎయిర్‌పోర్టుకు డొనాల్డ్ ట్రంప్ పేరు!

ఫ్లోరిడాలోని పామ్ బీచ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు పేరు మారనుంది. దీనికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరును పెట్టనున్నారు. ఇందుకు సంబంధించిన బిల్లుకు రాష్ట్ర శాసనసభ ఆమోదం తెలిపింది. ఫ్లోరిడా గవర్నర్ రాన్ డిశాంటిస్ త్వరలోనే దీనిపై సంతకం చేయనున్నారు. అనంతరం ఈ విమానాశ్రయం పేరు మార్పునకు ఫెడరల్ ఏవియేషన్ ఆమోదం కూడా అవసరం. ట్రంప్ నివాసం 'మార్ ఎ లాగో'కు కొద్ది దూరంలోనే ఉన్న ఈ ప్రాంతం ఇసుక బీచ్‌లు, లగ్జరీ ఎస్టేట్‌లకు ప్రసిద్ధి. స్థిరాస్తి వ్యాపారంలో ఉన్న ట్రంప్‌నకు.. ఆయన పేరుతో ప్రపంచ వ్యాప్తంగా అనేక భవనాలున్నాయి. అయితే, అమెరికాలోని ప్రముఖ ప్రాంతాలకు తన పేరు ఉండాలని భావిస్తున్న ట్రంప్.. ఇందుకోసం చాలా ప్రయత్నాలు చేస్తున్నారు. వాషింగ్టన్‌లోని కెనడీ స్మారక కాంప్లెక్స్ పేరును 'ట్రంప్‌కెనడీ సెంటర్'గా మార్చేందుకు ఇప్పటికే ఆమోదం తెలిపారు. న్యూయార్క్ పెన్ స్టేషన్ (న్యూయార్క్‌లోని అతిపెద్ద రైలు, రోడ్డు కనెక్టివిటీ కేంద్రం)తోపాటు వాషింగ్టన్‌లోని డల్లెస్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులకు తన పేరు పెట్టేందుకు ప్రయత్నించినప్పటికీ తీవ్ర వ్యతిరేకత వచ్చినట్లు సమాచారం.

# మాజీ అధ్యక్షుడు.. 8 నెలలైనా పూర్తికాని అంత్యక్రియలు!

జాంబియా మాజీ అధ్యక్షుడు ఎడ్గర్ లూంగూ మరణించి ఎనిమిది నెలలైనా ఇప్పటివరకు అంత్యక్రియలు నిర్వహించలేదు. వీటి నిర్వహణపై ఆయన కుటుంబ సభ్యులు, అక్కడి ప్రభుత్వానికి మధ్య కొనసాగుతున్న వివాదమే ఇందుకు కారణం. వివాదాలు, చర్చలు చివరకు న్యాయస్థానం తీర్పు చెప్పినప్పటికీ అంత్యక్రియలు మాత్రం పూర్తి కాలేదు. దీంతో ఆయన పార్థివదేహం శవాగారంలోనే ఉండిపోయింది. జాంబియాకు అధ్యక్షుడిగా (2015-21 మధ్యకాలంలో) పనిచేసిన ఎడ్గర్ లూంగూ గతేడాది జూన్ 5న దక్షిణాఫ్రికాలోని ఓ ఆసుపత్రిలో కన్నుమూశారు. అయితే, తన అంత్యక్రియలకు హకైండే హిచిలేమా (ప్రస్తుత అధ్యక్షుడు) హాజరు కావద్దని, పార్థివ దేహం వద్దకు ఆయన రావద్దని తమతో చెప్పినట్లు పేర్కొన్న లూంగూ కుటుంబ సభ్యులు.. జోహన్నెస్‌బర్గ్‌లోనే వీటిని నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకోసం ఓ ప్రైవేటు శ్మశాన వాటికలో ఏర్పాట్లు చేశారు. అయితే, మాజీ అధ్యక్షుడి అంత్యక్రియలు చట్ట ప్రకారం ప్రభుత్వ లాంఛనాలతో జరగాల్సి ఉందని పేర్కొంటూ జాంబియా ప్రభుత్వం అంతిమ సంస్కారాలకు కొన్ని గంటల ముందే దక్షిణాఫ్రికా కోర్టులో పిటిషన్ వేయడంతో వివాదం మొదలైంది. గతంలో కన్నుమూసిన అధ్యక్షులను ఖననం చేసిన శ్మశాన వాటికలోనే (రాజధాని లుకాసాలో) అంత్యక్రియలు నిర్వహిస్తామని, ఎడ్గర్ లూంగూ కోసం అక్కడ సమాధిని సిద్ధం చేశామని పేర్కొంది. న్యాయస్థానాల్లో పలుసార్లు వాదనలు జరగ్గా.. చివరకు




జాంబియాలోనే అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశించింది. తాము కోరుకున్న విధంగా అంతిమ సంస్కారాలు చేయడం లేదని వాదిస్తోన్న లూంగూ కుటుంబం.. సుప్రీం కోర్టులో న్యాయపోరాటం చేస్తోంది. దీంతో ఆయన అంతిమ సంస్కారాలపై సుదీర్ఘకాలంగా సందిగ్ధత కొనసాగుతూనే ఉంది.

## వీకెండ్ వేళ మార్కెట్లకు లాభాల కళ..

**82,800 దాటిన సెన్సెక్స్**

**316 పాయింట్ల లాభంతో 82,814 వద్ద స్థిరపడిన సెన్సెక్స్**

**పీఎస్‌యూ బ్యాంకింగ్, మెటల్ రంగాల షేర్లకు లాభాలు**

**ఐటీ రంగ షేర్లలో అమ్మకాల ఒత్తిడి**

**డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ స్వల్పంగా బలపడిన వైనం**



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీ లాభాలతో ముగిశాయి. పీఎస్‌యూ బ్యాంకులు, మెటల్ రంగ షేర్లలో బలమైన కొనుగోళ్లు జరగడంతో సూచీలు రాణించాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 316 పాయింట్లు లాభపడి 82,814 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 116 పాయింట్లు పెరిగి 25,571 వద్ద ముగిసింది.

రంగాల వారీగా చూస్తే, ఐటీ, మీడియా మినహా మిగిలినవన్నీ లాభాల్లో ముగిశాయి. నిఫ్టీ ఐటీ సూచీ 0.98 శాతం నష్టపోగా, పీఎస్‌యూ బ్యాంకింగ్ సూచీ 1.68 శాతం, మెటల్ సూచీ 1.25 శాతం చొప్పున లాభపడ్డాయి. పవర్, క్యాపిటల్ గూడ్స్, ఎఫ్ఎంసీజీ స్టాక్స్‌లో కూడా కొనుగోళ్ల ఆసక్తి కనిపించింది. అయితే, మార్కెట్ బ్రెడ్త్ మాత్రం ప్రతికూలంగా ఉంది. 2,043 షేర్లు లాభపడగా, 2,511 షేర్లు నష్టాల్లో ముగిశాయి.

రోజు ప్రారంభంలో ఒడుదొడుకులకు లోనైనప్పటికీ, తక్కువ స్థాయిల వద్ద నాణ్యమైన షేర్లను కొనుగోలు చేసేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపడంతో మార్కెట్లు పుంజుకున్నాయని విశ్లేషకులు తెలిపారు. అమెరికా-ఇరాన్ మధ్య భౌగోళిక ఉద్రిక్తతలు, మిశ్రమ అంతర్జాతీయ సంకేతాల కారణంగా సమీప భవిష్యత్తులో మార్కెట్ కొంత రేంజ్-బౌండ్‌లోనే ఉండవచ్చని వారు అంచనా వేస్తున్నారు.

ఇక డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 0.02 శాతం బలపడి 90.99 వద్ద ముగిసింది. బ్యాంక్ నిఫ్టీ కీలకమైన 61,200 స్థాయి పైన ముగియడం సానుకూల సంకేతమని, 61,000 స్థాయి కీలక మద్దతుగా, 61,350-61,400 స్థాయి తక్షణ నిరోధకంగా పనిచేయవచ్చని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడ్డారు.

## 'ఏఐ'ని క్రమం తప్పకుండా వాడకుంటే ప్రమోషన్లు ఉండవు

**యాక్సెంచర్ కీలక నిర్ణయం**

**ఏఐ టూల్స్‌ను తప్పనిసరిగా ఉపయోగించుకోవాలని ఉద్యోగులకు యాక్సెంచర్ సూచన**

**వాటి వినియోగం ఆధారంగా కూడా లీడర్‌షిప్ రోల్స్ అందుకుంటారని స్పష్టీకరణ**

**సీనియర్ మేనేజర్లు, అసోసియేట్ డైరెక్టర్లకు కంపెనీ మెయిల్**




**న్యూఢిల్లీ:** ప్రముఖ గ్లోబల్ కన్సల్టింగ్ దిగ్గజం యాక్సెంచర్, ప్రమోషన్ల అర్హతలో కృత్రిమ మేధ (ఏఐ)ను క్రమం తప్పకుండా ఉపయోగించడం ఒక కీలకమైన అంశంగా మార్చింది. సీనియర్ ఉద్యోగులు 'ఏఐ' టూల్స్‌ను తప్పనిసరిగా ఉపయోగించుకోవాలని యాక్సెంచర్ సూచించింది. వాటి వినియోగం ఆధారంగా కూడా లీడర్‌షిప్ రోల్స్ అందుకుంటారని, లేదంటే ప్రమోషన్లు ఉండవని సంకేతాలు ఇచ్చింది.

కంపెనీలు డిజిటల్ మార్పును వేగవంతంగా అందిపుచ్చుకుంటున్నాయి. ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ రంగం 'ఏఐ'ని అందిపుచ్చుకుని మెరుగైన పనితీరును కనబరచాలని ఆయా సంస్థలు భావిస్తున్నాయి. ఈ క్రమంలో యాక్సెంచర్ ఉద్యోగుల ప్రమోషన్లకు సంబంధించి ఈ కీలక సూచన చేసింది. సీనియర్ మేనేజర్లు, అసోసియేట్ డైరెక్టర్లకు కంపెనీ మెయిల్ ద్వారా ఈ సందేశం పంపించినట్లు మీడియాలో కథనాలు వచ్చాయి.

లీడర్‌షిప్ పాత్రలో ఎదగడానికి ఏఐ సాధనాలను క్రమం తప్పకుండా ఉపయోగించాలని స్పష్టం చేసింది. క్లయింట్లకు అత్యుత్తమ, వేగవంతమైన సేవలు అందించడానికి ఇది అవసరమని యాక్సెంచర్ భావిస్తోంది. యాక్సెంచర్ కొంతకాలంగా ఏఐపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఏఐతో రీస్కిల్ చేయడం సాధ్యంకాని ఉద్యోగులకు ఉద్వాసన పలికింది.

మరోవైపు, కంపెనీ ఏఐ ప్రణాళికలకు సిద్ధంగా లేని ఉద్యోగులు స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ చేయాలని గూగుల్ ఇటీవల తెలిపింది. ఇందుకోసం విరమణ ప్యాకేజీని కూడా ప్రకటించింది. అమెజాన్, మెటా, మైక్రోసాఫ్ట్ తదితర టెక్ దిగ్గజాలు కూడా గూగుల్ బాటలోనే పయనించాయి.

## ఏఐతో ఉద్యోగ గండం..


**18 నెలల్లో లక్షల కొలువుల మాయం!**

**వైట్ కాలర్ ఉద్యోగులపై తీవ్ర ప్రభావం తప్పదన్న ఆండ్రూ యాంగ్**

**ఖర్చు తగ్గించుకోవడానికి కంపెనీలు ఏఐ వైపు మొగ్గు**

**టెక్ దిగ్గజాల్లో ఇప్పటికే మొదలైన ఉద్యోగాల కోత**

**ఏఐ కంపెనీలపై పన్ను విధించాలని సూచన**




**న్యూఢిల్లీ:** కృత్రిమ మేధ సాంకేతికత శరవేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో అమెరికాలో రాబోయే 12 నుంచి 18 నెలల్లో లక్షలాది వైట్ కాలర్ ఉద్యోగాలు ప్రమాదంలో పడనున్నాయని మాజీ డెమోక్రాటిక్ అధ్యక్ష అభ్యర్థి, వ్యాపారవేత్త ఆండ్రూ యాంగ్ సంచలన హెచ్చరికలు జారీ చేశారు. ఏఐ ప్రోగ్రామ్‌లు నిమిషాల్లో పూర్తి చేస్తున్న పనులకు గతంలో డిజైనర్లకు రోజుల సమయం పట్టేదని, ఈ మార్పు ఉద్యోగ విపత్తుకు సంకేతమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

ఆండ్రూ యాంగ్ విశ్లేషణ ప్రకారం కాల్ సెంటర్ సిబ్బంది, మార్కెటింగ్ నిపుణులు, కోడర్లు, డేటా అనలిస్టులు చేసే పనులను ఏఐ ఇప్పుడు సులభంగా పూర్తి చేస్తోంది. కేవలం సమాచారాన్ని విశ్లేషించి నివేదికలు ఇచ్చే సీనియర్ స్థాయి ఉద్యోగుల అవసరం కూడా భవిష్యత్తులో తగ్గిపోతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఒక సంస్థ ఖర్చులను తగ్గించుకోవడానికి ఏఐని వాడి సిబ్బందిని తొలగిస్తే, పోటీలో నిలబడటానికి మిగతా సంస్థలు కూడా అదే మార్గాన్ని అనుసరించక తప్పదని ఆయన విశ్లేషించారు. సిబ్బందిని తగ్గించి లాభాలు పెంచుకునే కంపెనీలకే స్టాక్ మార్కెట్ పెద్దపీట వేయడం కూడా ఈ ధోరణికి కారణమవుతోందని తెలిపారు.

## టీ20 వరల్డ్ కప్‌లో సెమీస్ చేరే

# టాప్-4 జట్లు

**మాజీ క్రికెటర్ల అంచనా**

**టీ20 ప్రపంచకప్ సూపర్ 8 దశకు ముందు మాజీ క్రికెటర్ల సెమీస్ అంచనాలు**

**భారత్, దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్ ముందంజలో ఉంటాయని ఎక్కువ మంది జోస్యం**

**వరుణ్ ఆరోన్ తన అంచనాల్లో దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్‌లను పక్కనపెట్టిన వైనం**

**ఆదివారం అహ్మదాబాద్‌లో దక్షిణాఫ్రికాతో భారత్ తొలి మ్యాచ్**

**ఒకే గ్రూప్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ భారత్, రన్నరప్ దక్షిణాఫ్రికా**



**న్యూఢిల్లీ:** ప్రస్తుతం ఉత్కంఠగా సాగుతున్న టీ20 ప్రపంచకప్ 2026 సూపర్ 8 దశకు చేరుకుంది. శనివారం కొలంబోలో పాకిస్థాన్, న్యూజిలాండ్ మధ్య మ్యాచ్‌తో ఈ కీలక ఘట్టం ప్రారంభం కానున్న నేపథ్యంలో, పలువురు భారత మాజీ క్రికెటర్లు సెమీ ఫైనల్ చేరే జట్లపై తమ అంచనాలను వెల్లడించారు. స్టార్ స్పోర్ట్స్ విడుదల చేసిన ఒక వీడియోలో వీరు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

సూపర్ 8లో ఎనిమిది జట్లను రెండు గ్రూపులుగా విభజించారు. గ్రూప్ 'ఏ'లో డిఫెండింగ్ ఛాంపియన్ భారత్, 2024 రన్నరప్ దక్షిణాఫ్రికా, వెస్టిండీస్, జింబాబ్వే ఉన్నాయి. గ్రూప్ 'బీ'లో పాకిస్థాన్, శ్రీలంక, ఇంగ్లండ్, న్యూజిలాండ్ తలపడనున్నాయి. భారత టెస్ట్ స్పెషలిస్ట్ ఛతేశ్వర్ పుజారా.. భారత్, దక్షిణాఫ్రికా, శ్రీలంక, న్యూజిలాండ్ సెమీస్‌కు అర్హత సాధిస్తాయని అంచనా వేశాడు. మహ్మద్ కైఫ్, యుజ్వేంద్ర చాహల్ మాత్రం భారత్, దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, న్యూజిలాండ్‌లకు ఓటేశారు. అయితే మాజీ పేసర్ వరుణ్ ఆరోన్ కాస్త భిన్నంగా భారత్, వెస్టిండీస్, ఇంగ్లండ్, పాకిస్థాన్ సెమీస్ చేరతాయని, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్‌లకు చోటు దక్కదని సంచలన జోస్యం చెప్పాడు. సంజయ్ బంగర్ తన జాబితాలో పాకిస్థాన్, భారత్, దక్షిణాఫ్రికా, శ్రీలంకలను ఎంచుకోగా, సబా కరీం.. భారత్, దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, శ్రీలంక వైపు మొగ్గు చూపాడు. సూపర్ 8లో భాగంగా డిఫెండింగ్ ఛాంపియన్ భారత్ తన తొలి మ్యాచ్‌ను ఆదివారం అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో దక్షిణాఫ్రికాతో ఆడనుంది. ఆ తర్వాత గురువారం చెన్నైలో జింబాబ్వేతో, మార్చి 1న కోల్‌కతాలో వెస్టిండీస్‌తో తలపడనుంది.

## శ్రీలంకను పడగొట్టిన

# రాధ యాదవ్..

**ఆసియా కప్ ఫైనల్లో భారత్..!**

**బ్యాంకాక్:** మహిళల ఆసియా కప్ రైజింగ్స్ స్టార్స్‌లో భారత ఏ జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. సెమీఫైనల్లో భారీ విజయంతో శ్రీలంకను ఇంటికి పంపి టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచింది. స్వల్ప ఛేదనలో ఓపెనర్ విందా దినేశ్(42), రాధా యాదవ్(32 నాటౌట్, 4-19) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడడంతో 5 వికెట్ల తేడాతో లంకను చిత్తు చేసింది. ఫైనల్లో బంగ్లాదేశ్‌తో తలపడనుంది.

బ్యాంకాక్ వేదికగా జరుగుతున్న మహిళల ఆసియా కప్ రైజింగ్ స్టార్స్‌లో భారత ఏ జట్టు పంజా విసిరింది. లీగ్ దశలో అదరగొట్టిన టీమిండియా సెమీఫైనల్లోనూ చెలరేగిపోయింది. భారీ స్కోర్‌తో భారత్‌కు చెక్ పెట్టాలనుకున్న లంక ఆశలకు కెప్టెన్ రాధా యాదవ్ (4-19) అడ్డుకట్ట వేసింది. వికెట్ల వేటతో రెచ్చిపోగా.. ప్రత్యర్థి 118 పరుగులకే కుప్పకూలింది.

లంక జట్టులో ఓపెనర్లు సంజనా కవింది(31), హన్సిమ కరుణరత్నే(14)లను విడదీసి తనూజ కన్వర్ బ్రేకివ్వగా.. అక్కడి నంచి రాధా యాదవ్ తిప్పేసింది. మిడిలార్డర్‌ను పడగొట్టిన తను.. లోయర్ ఆర్డర్‌ను డగౌట్ చేర్చింది. ఆఖర్లో శశిని గుహ్మని(22) మాత్రమే




రాణించగా లంక 118కి ఆలౌటయ్యింది.

**విందా, రాధ దూకుడు**

ప్రత్యర్థిని తక్కువకే కట్టడి చేసి సగం విజయం సాధించిన భారత్‌కు ఓపెనర్లు నందినీ కశ్యప(14), విందా దినేశ్‌లో (42) అదిరే ఆరంభమిచ్చారు. వీరిద్దరూ ఔటయ్యాక క్రీజునంటుకుపోయిన రాధా యాదవ్(31 నాటౌట్) లంక బౌలర్లను ధీటుగా ఎదుర్కొంది. అజేయంగా నిలిచి జట్టును ఫైనల్‌కు తీసుకెళ్లింది. 5 వికెట్ల తేడాతో టీమిండియా జయకేతనం ఎగురవేసిన భారత్ ఆదివారం జరుగబోయే టైటిల్ పోరులో బంగ్లాదేశ్‌ను ఢీకొట్టనుంది.

## వరుసగా డకౌట్ అవుతున్న

# అభిషేక్ శర్మకు గవాస్కర్ సలహా

**టీ20 ప్రపంచకప్‌లో వరుసగా మూడోసారి డకౌటైన అభిషేక్ శర్మ**

**అంచనాల భారంతోనే అభిషేక్ ఒత్తిడికి గురవుతున్నాడన్న గవాస్కర్**

**మొదటి బంతికే సిక్స్ కొట్టాలని చూడొద్దని, క్రీజులో కుదురుకోవాలని సూచన**

**అభిషేక్ త్వరలోనే ఫామ్ అందుకుంటాడని ధీమా వ్యక్తం చేసిన అసిస్టెంట్ కోచ్**

**సూపర్ 8 దశ నాటికి అతను రాణిస్తాడని జట్టు యాజమాన్యం ఆశాభావం**

**న్యూఢిల్లీ:** టీ20 ప్రపంచకప్ 2026లో భారత యువ ఓపెనర్ అభిషేక్ శర్మ పేలవ ఫామ్ కొనసాగుతోంది. నెదర్లాండ్స్‌తో జరిగిన చివరి గ్రూప్ మ్యాచ్‌లోనూ డకౌట్ అవ్వడంతో, ఈ టోర్నీలో అతను వరుసగా మూడోసారి సున్నాకే పెవిలియన్ చేరినట్టయింది. అంచనాల భారమే 25 ఏళ్ల అభిషేక్‌పై తీవ్ర ఒత్తిడిని పెంచుతోందని, అతను భారీ షాట్ల కోసం తొందరపడకుండా క్రీజులో సమయం



గడపడంపై దృష్టి పెట్టాలని భారత మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ సూచించాడు.

ఈ వరుస వైఫల్యాలతో, టీ20 ప్రపంచకప్‌ల చరిత్రలో భారత్ తరఫున అత్యధిక డకౌట్లు నమోదు చేసిన ఆశిష్ నెహ్రా సరసన అభిషేక్ నిలిచాడు. స్టార్ స్పోర్ట్స్‌లో గవాస్కర్ మాట్లాడుతూ, "అభిషేక్ మంచి ఆటగాడే, కానీ అంచనాలు అతనిపై భారం మోపుతున్నట్లు కనిపిస్తోంది. మొదటి బంతికే బౌండరీ లేదా సిక్స్ కొట్టాలని ప్రయత్నించకూడదు. భారీ షాట్లు వాటంతట అవే వస్తాయి కానీ, బలవంతంగా ఆడకూడదు" అని విశ్లేషించాడు.

అమెరికాపై గోల్డెన్ డక్‌తో మొదలైన అభిషేక్ వైఫల్యం, పాకిస్థాన్, నెదర్లాండ్స్ మ్యాచ్‌లలోనూ పునరావృతమైంది. ప్రతీసారి ఇన్నింగ్స్ మొదటి ఓవర్‌లోనే దూకుడుగా ఆడే ప్రయత్నంలో వికెట్ పారేసుకున్నాడు. "ముందు ఒక పరుగు తీసి ఖాతా తెరవాలి. నాలుగైదు బంతులు డాట్ అయినా ఫర్వాలేదు, తర్వాత కవర్ చేయొచ్చు. కాస్త క్రీజులో కుదురుకుంటే, అతని సహజమైన ఆట అదే బయటకు వస్తుంది" అని గవాస్కర్ పేర్కొన్నాడు.

## అఫ్ఘనిస్థాన్ క్రికెట్‌కు చుక్కాని..

# చెరగని ముద్రతో వీడ్కోలు..!

**న్యూఢిల్లీ:** ఒకప్పుడు అనామక జట్టుగా ఉండే అఫ్ఘనిస్థాన్ సంచలనాలకు కేరాఫ్‌గా మారడం చూసి వారెవ్వా ఏం ఆడుతున్నారు అని ఆశ్చర్యపోయాం. అంతర్జాతీయ వేదికలపై ఆ జట్టు బౌలర్లు స్టార్ ఆటగాళ్లను ముప్పతిప్పలు పెడుతుంటే వారి ప్రతిభకు సలాం కొట్టాం. మూడేళ్లలో అఫ్ఘనిస్థాన్ జట్టు ఆటలో వచ్చిన అనూహ్య మార్పులకు కారణం.. హెడ్‌కోచ్ జొనాథన్ ట్రాట్. తన క్రికెట్ బుర్రతో అఫ్ఘన్ కుర్రాళ్లను రాటుదేల్చిన ట్రాట్.. అమ్మో ఆ జట్టుతో కాస్త జాగ్రత్త అనే అభిప్రాయం కలిగించాడు.

కాబూలీ టీమ్‌కు చుక్కానిలా నిలిచిన జొనాథన్ ట్రాట్ వరల్డ్‌కప్ గ్రూప్ దశ చివరి మ్యాచ్ అనంతరం బాధ్యతల నుంచి వైదొలిగాడు. భారమైన హృదయంతో వీడ్కోలు పలికిన అతడిని చూసి.. అఫ్ఘన్ ఆటగాళ్లు భావోద్వేగానికి లోనయ్యారు. ట్రాట్ సైతం తన ప్రయాణాన్ని గుర్తు చేసుకుంటూ అద్భుతమైన జ్ఞాపకాలతో వెళ్తున్నానని చెప్పాడు.

'ఆటగాడిగానే కాదు కోచ్‌గానూ మర్చిపోలేని జ్ఞాపకాలను పోగు చేసుకున్నందుకు నేను చాలా అదృష్టవంతుడిని. వరల్డ్‌కప్‌లో పాకిస్థాన్‌ను తొలిసారి ఓడించడం.. ఇంగ్లండ్‌ను మట్టికరిపించడం, పాక్ వంటి పెద్ద జట్టుపై ద్వైపాక్షిక సిరీస్ గెలుపొందడం మర్చిపోలేని విజయాలు' అని ట్రాట్ వెల్లడించాడు. కోచ్‌గా చెరగని ముద్ర వేసిన ట్రాట్ వీడ్కోలు




ప్రకటనను అఫ్ఘన్ ఆటగాళ్లు నమ్మలేకపోయారు. తమలో ఒకడిగా ఉంటూ.. జట్టును విజయాల వైపు నడిపించిన అతడి సేవల్ని గుర్తు చేసుకున్నారు. 95 పరుగులతో కెనడాపై విజయంలో కీలకమైన ఇబ్రహీం జద్రాన్ తన ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును ట్రాట్‌కు అంకితమిచ్చాడు.

**వరల్డ్‌కప్‌లో సెమీస్‌కు..**

చిన్నజట్టుగా క్రికెట్‌లోకి అడుగుపెట్టిన అఫ్ఘనిస్థాన్.. బంగ్లాదేశ్ మాదిరిగానే సంచలన ఆటతో వార్తల్లో నిలిచింది. సమిష్టిగా రాణిస్తూ.. పెద్ద జట్ల పాలిట విలన్‌లా మారింది. జొనాథన్ ట్రాట్ కోచింగ్‌లో ఆ జట్టు అద్భుత విజయాలు సాధించింది. 2023 వన్డే వరల్డ్‌కప్‌లో అసాధారణ ఆటతో రెచ్చిపోయిన అఫ్ఘన్ జట్టు. మాజీ ఛాంపియన్లను శ్రీలంక, ఇంగ్లండ్, పాకిస్థాన్‌లను చిత్తు చేసింది. పొట్టి ప్రపంచకప్‌లోనూ రషీద్ ఖాన్ సారథ్యంలో దుమ్మురేపి సెమీస్‌కు చేరింది. ఐసీసీ ఈవెంట్‌లో సెమీస్ వరకూ రావడం ఆ దేశ క్రికెట్‌లో పెద్ద సంచలనం. అయితే.. పదో సీజన్‌లో మాత్రం రషీద్ సేన స్థాయికి తగ్గట్టు ఆడలేదు. రెండే విజయాలతో గ్రూప్ దశలోనే నిష్క్రమించింది.

# ట్రయాంగిల్ లవ్ స్టోరీగా కాక్ టెయిల్ 2

## 'కాక్ టెయిల్ 2'లో రష్మిక పాత్ర వైరల్

## లెస్బియన్ జంటగా కృతి సనన్, రష్మిక!





టాకీస్: వరుస విజయాలతో దూసుకుపోతున్న రష్మిక మందన్న, ఇప్పుడు మరో ప్రయోగాత్మక పాత్రతో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతున్నారు. బాలీవుడ్‌లో మోస్ట్ అవేటెడ్ మూవీగా భావిస్తున్న 'కాక్‌టెయిల్ 2'లో ఆమె పోషిస్తున్న పాత్ర గురించి ప్రస్తుతం సోషల్ మీడియాలో ఒక ఆసక్తికరమైన వార్త వైరల్ అవుతోంది. షాహిద్ కపూర్ ప్రధాన పాత్రలో రానున్న ఈ చిత్రంలో కృతి సనన్, రష్మిక మందన్న కీలక పాత్రలు పోషిస్తున్నారు. బాలీవుడ్ మీడియా సమాచారం ప్రకారం.. ఈ సినిమాలో వీరిద్దరూ స్వలింగ ప్రేమికులుగా కనిపించనున్నట్లు తెలుస్తోంది. దీనిపై అధికారిక సమాచారం రాకపోయినప్పటికీ వీరి పాత్రల గురించి ప్రచారం మాత్రం జోరుగా సాగుతోంది. ఇదొక విభిన్నమైన ట్రయాంగిల్ లవ్ స్టోరీ అని, రష్మిక-కృతి పాత్రల మధ్య కెమిస్ట్రీ సినిమాకే హైలైట్‌గా నిలవనుందని టాక్ వినిపిస్తోంది. దీనిపై అధికారిక ప్రకటన రాకపోయినప్పటికీ, ఈ వార్త సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. షూటింగ్ పూర్తి.. త్వరలోనే రిలీజ్ హోమీ అదజానియా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ జనవరి 31వ తేదీతో పూర్తయింది. 2012లో సైఫ్ అలీ ఖాన్, దీపికా పదుకొణె నటించిన సూపర్ హిట్ 'కాక్‌టెయిల్' చిత్రానికి ఇది సీక్వెల్‌గా వస్తోంది. ఈ సినిమాలో షాహిద్ మునుపెన్నడూ చూడని సరికొత్త లుక్‌లో కనిపిస్తారని దర్శకుడు వెల్లడించారు. త్వరలోనే ఈ మూవీ రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తామని చెప్పారు.

MOVIE TIME


## ఉస్తాద్ నుంచి 22న

# మరో సాంగ్ విడుదల



టాకీస్: 'గబ్బర్‌సింగ్' తర్వాత పవన్ కల్యాణ్ – డైరెక్టర్ హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న సినిమా 'ఉస్తాద్ భగత్‌సింగ్'. మార్చి 26న ఈ చిత్రం విడుదల కానున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా చిత్ర బృందం ప్రమోషన్స్‌లో జోష్ పెంచింది. ఇప్పటికే ఓ పాటను రిలీజ్ చేయగా.. తాజాగా 'ఆరా ఆఫ్ ఉస్తాద్' సాంగ్ ప్రోమోను పంచుకుంది. పూర్తిపాటను ఈ నెల 22న విడుదల చేయనుంది. విజువల్స్, మ్యూజిక్‌ని బట్టి ఈ సాంగ్ పవర్‌ఫుల్‌గా ఉండనున్నట్లు తెలుస్తోంది.

# యశ్ టాక్సిక్ టీజర్ విడుదల




టాకీస్: యశ్ హీరోగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'టాక్సిక్'. 'ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్‌అప్స్' అనేది ఉప శీర్షిక. ఇందులో యశ్‌తో పాటు అయిదుగురు హీరోయిన్లు కీలక పాత్రలు పోషిస్తున్నారు. నదియా పాత్రలో కియారా కనిపించనుండగా హ్యూమా ఖురేషీ ఎలిజబెత్‌గా, నయనతార గంగ పాత్రలో, రెబెకాగా తారా సుతారియా, మెలిసా అనే పాత్రలో రుక్మిణి వసంత్ ఆకట్టుకోనున్నారు. మార్చి 19న ఈ సినిమా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో తాజాగా దీని టీజర్‌ను విడుదల చేశారు. విరోధం పెట్టుకొని బతకలేవు.. పట్టుదల వదిలేయ్ అనే డైలాగులతో మోస్ట్ వైలెంట్‌గా రాయాపాత్రలో యశ్ కనిపించారు.

# కామెడీ ట్రాక్‌లో హే బలవంత్..




టాకీస్: ప్రేక్షకులను అలరిస్తే చాలు పెద్ద స్టార్ కాస్ట్ లేకపోయినా చిన్న సినిమాలు కూడా థియేటర్లలో రాణిస్తాయి. ఇటీవల 'లిటిల్ హార్ట్స్', 'రాజు వెడ్స్ రాంబాయి' విజయాలే దానికి నిదర్శనం. ఆ సినిమాలను విడుదల చేసిన బన్నీ వాస్, వంశీ నందిపాటి మరోసారి కలిసి సుహాస్ నటించిన 'హే బల్‌వంత్' చిత్రాన్ని తీసుకొచ్చారు. సీక్రెట్ బిజినెస్ కాన్సెప్ట్‌తో చేసిన ప్రమోషన్స్ ఈ సినిమాపై ఆసక్తిని పెంచాయి. కృష్ణ (సుహాస్) చిన్నప్పటి నుంచే తండ్రి బల్‌వంత్ (నరేష్) చేస్తున్న బిజినెస్ చేయాలని నిర్ణయించుకుంటాడు. కానీ ఆ వ్యాపారం ఏమిటో అతనికి తెలియదు. దాన్ని దాచేందుకు బలవంత్ అతడిని బోర్డింగ్ స్కూల్‌లో పెడతాడు. చదువు పూర్తయ్యాక ఇంటికి వచ్చిన కృష్ణ, అనారోగ్యానికి గురైన తండ్రి స్థానంలో బిజినెస్ బాధ్యతలు తీసుకోవడానికి ఆఫీస్‌కు వెళ్తాడు. ఆ వ్యాపారాన్ని కళ్లారా చూసిన అతనికి పెద్ద షాక్ ఎదురవుతుంది. ఇంతకీ ఆ బిజినెస్ ఏమిటి? ఆ వ్యాపారం అతని ప్రేమ, తండ్రితో ఉన్న బంధాలపై ఎలాంటి ప్రభావం చూపిందనేదే కథ.నవ్విస్తూనే మనసులను హత్తుకునే కథ చెప్పాలనే ప్రయత్నం చేశాడు దర్శకుడు గోపి అచ్చర. ఈ ప్రయత్నం చాలా వరకు సక్సెస్ అయ్యింది.

# డాటర్ ఆఫ్ ప్రసాదరావు ట్రైలర్ విడుదల

టాకీస్: రాజీవ్ కనకాల, ఉదయభాను, వసంతిక, శ్రీరామ్ వెంకట్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'డాటర్ ఆఫ్ ప్రసాద్ రావు'. త్వరలోనే ఈ మూవీ విడుదల కాబోతోంది. 'రెక్కీ', 'విరాటపాలెం' మేకర్స్ నుంచి రాబోతోన్న మరో ఆసక్తికర థ్రిల్లర్ మూవీ ఇది. కృష్ణ పోలూరు దర్శకత్వం వహించారు. ఈ సినిమాని ఫిబ్రవరి 27 నుంచి జీ5లో స్ట్రీమింగ్ చేయనున్నారు. ఈ క్రమంలో ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్‌ను విడుదల చేశారు.




## తెలంగాణ బ్యూటీగా

# మానస వారణాసి

### 'కపుల్ ఫ్రెండ్లీ'తో దక్కిన హిట్

### ఒక్కసారిగా పెరిగిన క్రేజ్

### కొత్త ప్రాజెక్టులు క్యూ కడుతున్నట్టు టాక్

టాకీస్: వెండితెరపై హీరోయిన్‌గా కనిపించాలంటే అందం ఒక్కటే వుంటే సరిపోదు .. అదృష్టం కూడా ఉండాలి. ఎందుకంటే ఎంతటి గ్లామర్ ఉన్నప్పటికీ .. టాలెంట్ ఉన్నప్పటికీ .. స్టార్ డమ్ దక్కడం అంత తేలికగా జరగదు. చాలామంది హీరోయిన్స్ తమ సినిమా హిట్ అయితే చాలు, తమ మార్కెట్ .. పారితోషికం పెరిగిపోతుందని అనుకుంటారు. కానీ సినిమా హిట్ అయినా ఒక్కోసారి ఆ క్రెడిట్ ఎవరి ఎకౌంటులోకో వెళ్లిపోతూ ఉంటుంది. అందుకే అంటారు అదృష్టం కూడా ఉండాలని.

హీరోయిన్స్ ఒకప్పటి మాదిరిగా తెరపై ఎక్కువ కాలం పాటు రాజ్యం చేసే పరిస్థితి లేదు. అందువలన ప్రతి సినిమా వాళ్లకి చాలా విలువైనదిగానే కనిపిస్తూ ఉంటుంది. హిట్ అయిన సినిమాతో మరింత పాప్యులర్ కావాలనే కోరుకుంటూ ఉంటారు. అయితే ఒక్కోసారి మొదటి ప్రయత్నం నిరాశపరిచినా, రెండో ప్రయత్నంతో దశ తిరిగిపోతూ ఉంటుంది. అలాంటి అందాల నాయికల జాబితాలో తాజాగా మానస వారణాసి పేరు కూడా చేరిపోయింది.

మానస వారణాసి తెలంగాణ అమ్మాయి. అనేక అందాల పోటీలలో బహుమతులు గెలుచుకున్న నాజూకు నాయిక. 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమా తరువాత అంతా ఈ బ్యూటీని గురించే మాట్లాడుకుంటున్నారు. పొన్నాగి పూలతో పోతబోసినట్టు .. తామర రేకులతో రాశి పోసినట్టుగా కనిపించే ఈ సుందరి పేరు ఇప్పుడు యూత్ జపించే మధురమైన మంత్రమైపోయింది.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.